

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 124 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 30 డిసెంబర్ 2024 | వెల : 4/-

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపుణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

# రేవంత్ ధైర్యం ఏమిటీ?



**ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవి చేపట్టడమే ఒక మిరాకిల్.**

**టీడీపీ అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా ఆయనకు ముద్ర ఉంది**

**చంద్రబాబు అంటే ఇప్పటికీ ఆయనకు గౌరవం ఉంది**

**తన రాజకీయ జీవితం ఈ స్థాయికి రావడానికి చంద్రబాబు నారు పోశారని రేవంత్ బలంగా నమ్ముతారు**

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకరకంగా తనపై ఉన్న ముద్రను చెరిపేసుకునే ప్రయత్నం చేస్తున్నట్లే కనిపిస్తుంది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవి చేపట్టడమే ఒక మిరాకిల్. టీడీపీ అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా ఆయనకు ముద్ర ఉంది. చంద్రబాబు అంటే ఇప్పటికీ ఆయనకు గౌరవం ఉంది. తన రాజకీయ జీవితం ఈ స్థాయికి రావడానికి చంద్రబాబు నారు పోశారని రేవంత్ బలంగా నమ్ముతారు. అందుకే పెద్దగా చంద్రబాబుతో సమావేశాలు కాకపోయినా లోపల మాత్రం ఎక్కడో ఒకచోట అభిమానం, అనుకూలత ఉంటుంది. అయితే రాజకీయంగా ఇద్దరివీ వేర్వేరు దారులు. చంద్రబాబుది బీజేపీతో పయనంగా కాగా, రేవంత్ రెడ్డి ఆ కూటమిని వ్యతిరేకించే కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా ఉన్నారు.తన పదవికి ఎప్పుడైనా ఎసరు రావడం అంటూ జరిగితే అందులో చంద్రబాబు కూడా ఒక కారణమవుతారని ఆయన ఖచ్చితంగా అంచనా వేస్తారు. తాను ఆ అవకాశం ఇవ్వదలచుకోలేదు. చంద్రబాబుతో నేరుగా యుద్ధానికి దిగకపోయినా ఆయన సామాజికవర్గం అధికంగా ఉన్న ఇండ్రస్ట్రీని గ్రిప్ లో ఉంచుకోవడం, - మిగతా3లో

# సంక్రాంతికే రైతు భరోసా

- కానీ వాళ్లంతా అనర్హులేనట..!
- కేబినెట్ సబ్ కమిటీ ఏం నిర్ణయించిందంటే
- సంక్రాంతికే రైతు భరోసా ఇవ్వాలని మంత్రి వర్గం సబ్ కమిటీ సమావేశంలో తీర్మానం
- రైతు భరోసా ఎవరికి ఇవ్వాలని, ఎవరికి ఇవ్వొద్దనే దానిపై ఫోకస్
- రైతు భరోసాపై కేబినెట్ సబ్ కమిటీ ఎలాంటి రిపోర్ట్ ఇస్తుందనేది ఆసక్తి



హైదరాబాద్

రైతు భరోసాపై తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సంక్రాంతికి రైతుభరోసా నిధులు విడుదల చేస్తామని ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. ఆ దిశగా స్పీడ్ పెంచుతోంది. దానిలో భాగంగానే.. రైతు భరోసాపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ మరోసారి సమావేశమైంది. సచివాలయంలో జరిగిన ఈ భేటీకి సబ్ కమిటీ సభ్యులు శ్రీధర్‌బాబు, - మిగతా3లో




## నేడు పీఎస్ఎల్వీ సీ 60 రాకెట్ ప్రయోగం

- మరి కొద్ది గంటల్లో కౌంట్‌డౌన్ ప్రారంభం
- నింగికేగనున్న పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ 320 టన్నుల బరువు
- 44.5 మీటర్ల ఎత్తు
- పీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్ఎల్వీ కోర్ అలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది.
- ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, వీటిని ఛేజర్, టార్గెట్ అనే పేర్లను నామకరణం

# సంక్రాంతి తర్వాత మహోద్యమమే

**కాంగ్రెస్ ప్రభుత్వానికి కేంద్రమంత్రి బండి సంజయ్ అల్టిమేటం**

**ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్**

**ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక లక్షలాది మంది విద్యార్థులు అల్లాడిపోతున్నారు**

**కాలేజీ యాజమాన్యాలు నష్టపోయి కాలేజీలు మూసుకునే దుస్థితి వచ్చింది**



కరీంనగర్

సంక్రాంతి లోపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మొత్తం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కిషన్ రెడ్డి అధ్యక్షతన మహోద్యమం చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక లక్షలాది మంది విద్యార్థులు అల్లాడిపోతున్నారని బండి సంజయ్ అన్నారు. కాలేజీ యాజమాన్యాలు నష్టపోయి కాలేజీలు మూసుకునే - మిగతా3లో



## మహా కుంభమేళాకు ముస్తాబవుతున్న అయోధ్య

- అప్పుడే హోటళ్లు ఫుల్!
- బాల రాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశాలు
- నూతన ఏడాది, మహా కుంభమేళా పురస్కరించుకొని అయోధ్య నగరం అందంగా ముస్తాబవుతోంది.
- రామమందిర ప్రారంభోత్సవం తర్వాత తొలిసారి కుంభమేళా జరుగుతుండడం వల్ల అయోధ్యలోనూ ముమ్మరంగా ఏర్పాట్లు

## కెమికల్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్

**విషవాయువు పీల్చి నలుగురు మృతి..**

**దహేజ్‌లో ఓ రసాయన కర్మాగారంలో విష వాయువు లీకేజీ**

**గుజరాత్ ఫ్లూరో కెమికల్స్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ యూనిట్ లో ఈ ప్రమాదం**

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీలు ఖరారు..

# ఆ పార్టీల మధ్యనే పోటీ..

గత అసెంబ్లీ ఎన్నికల(2020) సమయంలో జనవరి 14న నోటిఫికేషన్ జారీ అవ్వగా, ఫిబ్రవరి 8న పోలింగ్ జరిగింది. ఫిబ్రవరి 11న ఓట్ల లెక్కింపు జరిగింది. ఈసారి కూడా కాస్త అటూఇటుగా తేదీలు ఖరారయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల నిర్వహణలో విద్యాశాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. కాబట్టి ఈ ఏడాది జరగబోయే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పరీక్షల తేదీలతో ఎన్నికల తేదీలకు ఇబ్బంది కలుగకుండా కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది.

**ముక్కోణపు పోరులో లాభపడేదెవ్వరు?**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గత రెండు పర్యాయాలు పోటీ ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీ భారతీయ జనతా పార్టీ మధ్యనే పోటీ నెలకొనగా.. ఈసారి కాంగ్రెస్ తన పూర్వవైభవం చాటుకోవాలని చూస్తోంది. ఆప్ కంటే ముందు సుదీర్ఘకాలం పాటు దేశ రాజధానిలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత డిపాజిట్లు సైతం దక్కించుకోలేని స్థితికి చేరుకుంది. ఆ పార్టీ ఓటు బ్యాంకు దాదాపుగా ఆప్ హస్తగతం చేసుకుంది. దాంతో కాంగ్రెస్ ఓటు బ్యాంకు 10 శాతానికి పడిపోయింది. కొద్ది నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి శత్రువు బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు కలసికట్టుగా పోటీ చేసినా ఫలితం లేకపోయింది. ఢిల్లీ ఓటర్లు అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు వేర్వేరు తీర్పులు ఇస్తున్నారు. జాతీయస్థాయిలో బీజేపీ నేతృత్వంలోని సుస్థిర ప్రభుత్వానికి మొగ్గుచూపుతూ వచ్చారు. అందుకే ఈ రెండు పార్టీలు కలిసినా సరే.. 7 సీట్లలో ఒక్కటి కూడా కైవసం చేసుకోలేకపోయింది. కానీ అసెంబ్లీ ఎన్నికల విషయానికి వచ్చేసరికి మాత్రం ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించి అమలు చేస్తున్న ఉచితాలు, ప్రజాకర్షక పథకాలు వరుసగా ఆయన్ను గెలిపిస్తూ వచ్చాయి. రాజధానిలో ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను మెరుగుపరిచి మార్కులు సాధించడం కూడా కేజ్రీవాల్‌కు కలిసొచ్చిన అంశాలయ్యాయి. దళిత, మైనారిటీ వర్గాల్లో కోల్పోయిన పట్టును మళ్లీ సాధిస్తూ తమ ఓటుబ్యాంకును మెరుగుపరుచుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఈ సారి ఎలాగైనా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉంది. ఇప్పటికే పొరుగునే ఉన్న హర్యానాలో గెలుపు వాకిట తడబడి ఓడిన కాంగ్రెస్ పార్టీ, ఢిల్లీ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఆప్ ప్రభుత్వంపై



విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ సాధించిన 53.57 శాతం ఓట్లు సాధించి 70 అసెంబ్లీ స్థానాల్లో 62 గెలుపొందగా, 38.51 శాతం ఓట్లు సాధించిన బీజేపీ 8 సీట్లలో విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 4.26 శాతానికే పరిమితమైంది. పదేళ్ల పాలనపై సహజంగా ఏర్పడే వ్యతిరేకతకు తోడు ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం, శీష్ మహల్‌గా పేరొందిన విలాస నివాస భవనం సహా 2020 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయలేకపోవడం వంటివి కేజ్రీవాల్‌కు ప్రతికూలాంశాలుగా మారాయి. ఈ ప్రతికూలతలు కేజ్రీవాల్ గతంలో సాధించిన 53 శాతం ఓట్లలో కోత విధిస్తాయని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. అయితే అవి ఎటువైపు మళ్లుతాయి అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న. ఒకవేళ నేరుగా బీజేపీకి బదిలీ అయితే ఆ పార్టీ విశేషంగా లాభపడుతుంది. అలాకాకుండా కాంగ్రెస్ వైపు మళ్లినా సరే.. పరోక్షంగా బీజేపీకే వరంగా మారుతుంది. తాజా లోక్‌సభ ఎన్నికల తర్వాత ముస్లిం మైనారిటీలు, దళిత ఓట్లలో మళ్లీ కొంతమేర పట్టు సాధించిన కాంగ్రెస్ పార్టీ, ఈ వర్గాలను కేజ్రీవాల్‌కు దూరం చేసినా సరే.. కమలదళానికే ఉపయోగం ఎక్కువ. కాంగ్రెస్ పెంచుకునే ఓట్లశాతం ఆ పార్టీని గెలిపించకపోయినా.. దశాబ్దకాలం తర్వాత ఖాతా తెరిచేందుకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీని బలహీనపరిచి, బీజేపీకి పరోక్ష ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. మరోవైపు అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పురుడుపోసుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఇతర రాజకీయ పార్టీలకు భిన్నమేమీ కాదని, అనేక రకాల అవినీతి, అక్రమాలకు తెరలేపిందని కమలదళం ప్రజాకోర్టులో బురదజల్లింది. ఇది తనపై సాగుతున్న కక్షసాధింపు రాజకీయమని, ప్రజాకోర్టులోనే తీర్పు అడుగుతానని సీఎం పదవిని వదులుకుని ఎన్నికల ప్రచారం చేపట్టిన కేజ్రీవాల్, కేసులు, అరెస్టు, జైలుపాలవడాన్ని సానుభూతి పవనాలుగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల్లో సాధించిన ఓట్లశాతాన్ని సమీప ప్రత్యర్థి బీజేపీతో పోల్చుకుంటే 15 శాతం తేడా ఉంది. ఇందులో ప్రతికూలతల కారణంగా కొంత మేర ఓట్లు తగ్గినా.. ఈ భారీ వ్యత్యాసాన్ని పూడ్చలేవని, సీట్లు కొన్ని తగ్గినా విజయం తమదేనన్న ధీమాలో ఆమ్ ఆద్మీ పార్టీ ఉంది.


# మహా కుంభమేళాకు ముస్తాబవుతున్న అయోధ్య

మహా కుంభమేళా కోసం అయోధ్య నగరం ముస్తాబవుతోంది. వచ్చే ఏడాది రామమందిరం ప్రారంభోత్సవం తర్వాత తొలిసారి మహా కుంభమేళా జరుగుతుండడం వల్ల అయోధ్యను అందంగా తీర్చిదిద్దుతున్నారు. నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం, బాల రాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశాలు ఉంది. అందుకే ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన ఏడాది, మహా కుంభమేళా పురస్కరించుకొని అయోధ్య నగరం అందంగా ముస్తాబవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 44 రోజుల పాటు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా కోసం అక్కడి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ కుంభమేళాకు కోట్ల మంది ప్రజలు తరలిరానున్నారు. కుంభమేళాకు వచ్చిన ప్రజలు అయోధ్య బాలరాముడి దర్శనానికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రామమందిర ప్రారంభోత్సవం తర్వాత తొలిసారి కుంభమేళా జరుగుతుండడం వల్ల అయోధ్యలోనూ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం., బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో అయోధ్యకు భారీగా భక్తులు తరలి రానున్నారు. దీంతో ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అయోధ్య రామ మందిర దర్శన వేళలు పెంచుతూ రామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్ నిర్ణయం తీసుకుంది.

**అయోధ్య నగర అలంకరణ**

అయోధ్య నగర వీధులను రాముని చిత్రాలతో అందంగా అలంకరిస్తున్నారు. రామ చరిత మానస్‌ను గోడలపై రూపొందించారు. గుప్తర్ ఘాట్ నుంచి కొత్త ఘాట్ వరకు రామాయణ ఇతివృత్తాలను గోడలపై చిత్రాల రూపంలో రూపొందిస్తున్నారు. రాత్రి వేళలో కూడా కనిపించేలా వాటికి విద్యుత్ దీపాలను అమర్చారు. అయోధ్యకు తరలివచ్చే భక్తుల కోసం మంచి నీటి సదుపాయన్ని ఏర్పాటు చేశారు.

అలాగే అయోధ్యలోని సూరజ్‌కుండ్‌లో లేజర్ షోను ఏర్పాటు



చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కుంభమేళా జరుగుతోన్న అన్ని రోజులు లేజర్ షో జరుగుతుందని చెప్పారు. రామాయణ చరిత్రను హిందీ, ఇంగ్లీషు భాషలలో వీడియోల రూపంలో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. కుంభమేళా కోసం వచ్చే విదేశీయులు కోసం ఆంగ్ల భాషలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

**హెూటళ్లు ఫుల్!**

కొత్త సంవత్సరం వేళ అయోధ్య నగరం పర్యటకులతో కళకళలాడనుంది. నూతన ఏడాది వేళ పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే హెూటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు స్వాగతం పలికేందుకు అంతా సిద్ధంగా ఉందని జనవరి 15 వరకు హెూటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయినట్లు స్థానిక హెూటల్ యజమానులు చెబుతున్నారు. చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే గదుల లభ్యత ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదే అదనుగా కొందరు హెూటళ్ల యజమానులు ఒక్కరోజుకు10వేల రూపాయలు వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించాయి. రాముడి ఆలయం, హనుమాన్‌గఢి, లతాచౌక్, గుప్తర్ ఘాట్, సూరజ్‌కుండ్, ఇతర ప్రఖ్యాత స్థలాల వద్ద భారీగా భద్రతా ఏర్పాటు చేసినట్లు అయోధ్య పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

**పెరగనున్న డిమాండ్**

మరోవైపు నూతన ఏడాది వస్తున్న వేళ అయోధ్యలో పువ్వులకు గిరాకీ పెరుగుతోంది. జనవరి మూడో తేదీ వరకు పూలకు గిరాకీ ఉండే అవకాశం ఉందని పూలు అమ్మేవాళ్లు చెబుతున్నారు. కొత్త ఏడాది వేళ దేశ నలుమూల నుంచి రాముడి దర్శనానికి భక్తులు రానున్న నేపథ్యంలో పువ్వులకు డిమాండ్ పెరుగుతున్నట్లు చెప్పారు. ప్రధానంగా బంతి పూలు, చామంతి పూలు, గులాబీ పువ్వులకు మంచి గిరాకీ ఉందని తెలిపారు.

## నేడు పీఎస్ఎల్‌వీ సీ 60 రాకెట్ ప్రయోగం..

**అమరావతి :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ప్రయోగానికి సిద్ధమయ్యింది. సోమవారం ప్రయోగించనున్న పీఎస్ఎల్‌వీ సీ 60 రాకెట్‌కు మరికొద్ది గంటల్లో కౌంట్‌డౌన్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సూళ్లురుపేట షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి సోమవారం రాత్రి 9.58 గంటలకు రాకెట్‌ను నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ రాకెట్ ప్రయోగానికి ఈరోజు రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభానికి ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ రాత్రి బెంగళూరు నుంచి షార్‌కు చేరుకోనున్నారు. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్ఎల్‌వీ కోర్ అలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది. రేపు నింగికేగనున్న పీఎస్ఎల్‌వీ సీ60 రాకెట్ 320 టన్నుల బరువు, 44.5 మీటర్ల ఎత్తు ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. స్ట్రాపాన్ బూస్టర్లను ఉపయోగించకపోవడంతో ఈ రాకెట్ బరువు 229 టన్నులుగా ఉంటుందని వివరించారు. రాకెట్‌లో రెండో దశకు ద్రవ ఇంధనం, మూడో దశకు ఘన ఇంధనం, నాలుగో దశకు ద్రవ ఇంధనాన్ని వినియోగించనున్నట్లు వివరించారు. ఇస్రో రూపొందించిన స్పాడెక్స్ అనే జంట ఉపగ్రహాలు ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, వీటిని ఛేజర్, టార్గెట్ అనే పేర్లను నామకరణం చేశామన్నారు. ఈ ఉపగ్రహాలు స్పేస్ డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్, మానవ అంతరిక్షయానం వంటి సేవలకు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.




## కెమికల్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్




గుజరాత్‌లోని భరూచ్ జిల్లాలో విషాద సంఘటన చోటు చేసుకుంది. దహేజ్‌లో ఓ రసాయన కర్మాగారంలో విష వాయువు లీకేజీ కారణంగా నలుగురు కార్మికులు మృతిచెందారు. దహేజ్ ప్రాంతంలోని గుజరాత్ ఫ్లూరో కెమికల్స్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ యూనిట్ లో ఈ ప్రమాదం జరిగింది. వాయువులు వెళ్లే ఒక పైప్‌లైన్‌కు రంధ్రం పడటంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు నిపుణులు గుర్తించారు. వాయువును పీల్చిన వెంటనే నలుగురు కార్మికులు స్పృహ కోల్పోయారు. వారిని గుర్తించిన ఇతర సిబ్బంది.. ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తర్వాత కొద్ది సేపటికే నలుగురు చనిపోయారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుగుతోంది.. ఈ మేరకు దహేజ్ పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ..కార్మికులను భరూచ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. నాలుగో కూలీ ఉదయం 6 గంటలకు మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ లిమిటెడ్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ ఘటనపై స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కంపెనీ నిర్లక్ష్యానికి కారణమని ప్రజలు ఆరోపిస్తూ, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కండోమ్ లో పెట్రోల్ పోసి....

**ముంబై :** రాజకీయ నాయకులపై, సినిమా వాళ్లపై... శత్రువులపై ఒక్కొక్కరూ ఒక్కోలా దాడి చేస్తారు. కర్రలు, రాళ్లతో కొట్టడం, గుడ్లు, టమోటాలు విసరడం.. మరీ కోపం ఎక్కువైతే కత్తులతో నరకడం, ఉరివేసి చంపడం, బాంబులు విసరడం ఇలా ఎన్నో రకాలుగా చేస్తుంటారు పలువురు నిందితులు. కానీ మనం ఇప్పుడు మాట్లాడుకోబోయే దాడి మాత్రం అంతకు మించింది. ఓ గ్రామ సర్పంచ్‌పై పగ పట్టిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు కండోమ్‌తో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సర్పంచ్ తీవ్రంగా గాయపడ్డాడు. కండోమ్ దాడి ఏంటబ్బా అనుకుంటున్నారా ఈ స్టోరీ మొత్తం చదివేయండి విషయం మీకే అర్థం అవుతుంది.మహారాష్ట్రలోని ధారశివ్ జిల్లామేసాయి జవల్గా గ్రామ సర్పంచ్ అయిన నామ్‌డియో నికమ్ ప్రస్తుతం పుణేలో నివాసం ఉంటున్నాడు. కానీ పనుల నిమిత్తం గ్రామానికి మూడు నాలుగు సార్లు వచ్చి వెళ్తుంటాడు. ఈక్రమంలోనే డిసెంబర్ 26వ తేదీ రోజు కూడా గ్రామానికి వస్తున్నాడు. తనకు చెందిన ఎస్‌యూవీ వాహనంలో డ్రైవర్ సహా మరో అధికారిని వెంటబెట్టుకుని బయలు దేరాడు. రాత్రి 10 గంటల సమయంలో తుల్జాపూర్‌కు చేరగానే రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వ్యక్తులు వచ్చారు.కారును అడ్డగించి మరీ వారి వెంట తెచ్చుకున్న సుత్తెతో కారు విండో పగులగొట్టారు. ఆపై కారులోకి ఓ కండోమ్‌ను విసిరారు. అయితే అందులో అప్పటికే పెట్రోల్ నింపి ఉంది. ఆపై నిప్పంటించి అక్కడి నుంచి పారిపోయారు నిందితులు. ఈ ఘటనలో సర్పంచ్ సహా మరో అధికారి గాయపడ్డారు. మళ్లీ వచ్చి వారేమైనా చేస్తారేమోనన్న భయంతో సర్పంచ్ వెంటనే స్థానిక పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. సర్పంచ్ సహా మరో అధికారిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.అయితే సర్పంచ్ నామ్‌డియో నికమ్.. తమకు గ్రామంలోని ఎవరితోనూ శత్రుత్వం లేదని చెబుతున్నారు. మరి ఈ దాడికి పాల్పడింది ఎవరో తెలుసుకునే పనిలో పడ్డారు పోలీసులు. ఇదిలా ఉండగా డిసెంబర్ ప్రారంభంలో బీడ్ జిల్లాలో మాసాజోగ్ గ్రామ సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్‌ను అపహరించి హత్య చేయడంపై పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం అవుతుంది. ఈకేసులో ప్రధాన సూత్రధారి రాష్ట్ర మంత్రి ధనంజయ్ ముండే సన్నిహితుడు వాల్మిక్ దాకర్ అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ గొడవ చల్లారక ముందే మరో సర్పంచ్‌పై దాడి జరగడంతో అంతా ఆందోళన చెందుతున్నారు. పోలీసులు కూడా కేసును సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 10 లక్షల విజిటర్స్ వీసాలు..




**ముంబై :** రికార్డు స్థాయిలో విజిటర్స్ వీసాలు సహా మొత్తం పది లక్షలకుపైగా వలసేతర వీసాలను భారతీయులకు జారీచేసినట్టు న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ప్రకటించింది. వరుసగా రెండో ఏడాది భారతీయులే టాప్‌లో నిలిచినట్టు పేర్కొంది. అలాగే, ఉన్నత విద్య కోసం తమ పౌరులను అమెరికాకు పంపిన దేశాల వరసలోనూ భారత్ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపింది. ఈ ఏడాది 3,31,000 మంది విద్యార్థులను భారత్ పంపినట్టు పేర్కొంది. 2008/2009 తర్వాత ఈ స్థాయిలో విదేశీ విద్యార్థులు అమెరికాకు రావడం ఇదే మొదటిసారి.అంతేకాదు, వరుసగా రెండో ఏడాది అత్యధికంగా గ్రాడ్యుయేట్లను అమెరికాకు పంపిన ఘనతను కూడా భారత్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం అమెరికాలో రెండు లక్షల మంది (19 శాతం) భారతీయ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. విద్య తర్వాతి స్థానంలో పర్యాటకం, వ్యాపార అవసరాల కోసం భారతీయులు తమ దేశాన్ని సందర్శిస్తున్నారని అమెరికా కాన్సులెట్ తెలిపింది. గత నాలుగేళ్లలో అమెరికాకు వెళ్లే భారతీయ పర్యటకుల సంఖ్య ఐదు రెట్లు పెరిగి.. 20 లక్షలకు చేరిందని వెల్లడించింది. 2023లో 11 నెలలతో పోల్చితే.. ఈ ఏడాది అదే కాలానికి పెరుగుదల 26 శాతమని తెలిపింది.ఇప్పటికే అమెరికాలో భారత్‌కు చెందిన నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాదారుల 50 లక్షల మంది ఉన్నారని, రోజూ ఈ వీసాలను వేలల్లో జారీ చేస్తున్నామని పేర్కొంది. ఇదే సమయంలో హెచ్-1బీ వీసా పునరుద్దరణ పైలట్ విధానం మంచి ఫలితాలను ఇచ్చిందని అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వీసాదారులు తమ దేశానికి వెళ్లకుండా అమెరికాలోనే రెన్యువల్ చేసుకునేలా ఈ విధానం తీసుకొచ్చారు. ఈ విధానంతో అత్యధికంగా అమెరికాకు ప్రత్యేక వృత్తి నిపుణులను అందిస్తున్న భారత్ ఎక్కువ లబ్ధి పొందనుంది.సాధారణంగా హెచ్-1బీ వీసాపై అమెరికా వెళ్లేవారు.. దాని గడువు ముగియగానే స్వదేశానికి వచ్చి స్టాంపింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రయోగాత్మకంగా చేపట్టిన కొత్త విధానం ప్రకారం.. ఇకపై అమెరికాలోనే వీసాలను రెన్యువల్ చేయించుకునే వెసులుబాటు కలగనుంది."భారతీయులకు 10 వలస వీసాలను జారీ చేశాం.. ఇది చట్టబద్ధమైన, నైపుణ్యం కలిగిన నిపుణుల వలసలను సులభతరం చేసింది... ఈ వీసాదారులు అమెరికాలో శాశ్వత నివాసితులు అయ్యారు.. ఇప్పటికే మా దేశంలో గణనీయంగా ఉన్న ప్రవాస భారతీయులకు వీరు అదనం' అని ఆ ప్రకటన పేర్కొంది. గణాంకాల ప్రకారం.. 24,000 పాస్‌పోర్టులు, ఇతర కాన్సులర్ సేవలను అందించింది. స్మార్ట్ ట్రావెలర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రోగ్రామ్ (గాఇఖ)లో మార్పుల వలన ఎంబసీ, కాన్సులేట్‌లను అమెరికా పౌరులను అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించడం, వారికి భద్రతకు హెచ్చరికలను పంపడం సులభతరం చేస్తోంది.

# డెడ్ బాడీ పార్శిల్ లో విస్తుపోయే నిజాలు

**విజయవాడ :** ఉండిలో డెడ్‌బాడీ డోర్ డెలివరీని కేసును పోలీసులు చేధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు శ్రీధర్ వర్మ అలియాస్ సుధీర్ వర్మతో పాటు అతని రెండో భార్య రేవతి మూడో భార్య సుష్మలను అరెస్ట్ చేశారు. రేవతి అక్క తులసి పేరిట ఉన్న ఆస్తి కోసం అమాయకుడిని హత్య చేసి ఆ శవాన్ని మహిళ ఇంటికి పార్సిల్ పంపి ఆపై బెదిరింపులకు పాల్పడినట్టు గుర్తించారు. నిందితుల వివరాలను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ నయీం అస్మీ వెల్లడించారు.ఉండి మండలం యండగండి గ్రామంలో ముదునూరి రంగరాజు నివాసానికి చెక్క పెట్టెలో మృతదేహం డెలివరీ చేసిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సొంత వదినను బెదిరించి భయపెట్టడానికి గ్రామానికి చెందిన పర్లయ్యను హత్య చేసి చెక్కపెట్టెలో డెలివరీ చేసినట్టు నిందితులు అంగీకరించారు. నిందితుడి రెండో భార్య రేవతి అక్క పేరుతో ఉన్న మూడెకరాల పొలం కోసమే ఈ డ్రామా నడిచినట్టు జిల్లా పోలీసులుప్రకటించారు.గ్రామానికి చెందిన పర్లయ్యను ప్రధాన నిందితుడు తిరుమాని శ్రీధర్ వర్మ హత్య చేసి చెక్కపెట్టెలో తన మూడో భార్య సాయంతో ఆటోలో తులసి ఇంటికి పంపినట్టు గుర్తించారు.శ్రీధర్ వర్మ రెండో భార్య రేవతి అక్క సాగి తులసి పేరిట ఉన్న మూడెకరాల పొలాన్ని కాజేయడానికి ఈ హత్యకు పాల్పడినట్టు గుర్తించారు.చెక్క పెట్టెలో శవాన్ని పంపి హత్య కేసులో ఇరుక్కుంటావని బెదిరించి ఆమెను బెదిరించే ప్రయత్నం బెడిసికొట్టింది. నిందితుడు శ్రీధర్‌వర్మ కూలీ పనికోసం వచ్చిన కాళ్ల గ్రామానికి చెందిన గాంధీనగరం వాసి బర్రె పర్లయ్యను నిందితుడు శ్రీధర్ వర్మ గొంతుకు ఉరి బిగించి హత్య చేశాడు. కాళ్ల మండలం కోపల్లె నుంచి ఉండి వచ్చే వాంద్రం దారిలో పర్లయ్యను నిందితుడు హత్య చేశాడు.కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం మల్లంపూడి గ్రామానికి చెందిన తిరుమాని శ్రీధర్ వర్మ అమ్మాయిలకు వల వేయడంలో దిట్ట. శ్రీధర్ వర్మకు మొదట ఎలిజబెత్ రాణితో పెళ్లైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోషల్ మీడియాలో మహిళలను వలపన్నడంలో ఆరితేరాడు. తనది కూడా క్షత్రియ సామాజిక వర్గమేనని నమ్మించి యండగండికి చెందిన రేవతిని పదేళ్ల క్రితం ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత గణపవరం మండలానికి చెందిన సుష్మను కూడా వివాహం చేసుకున్నాడు.రేవతి అక్క పేరుతో ఉన్న ఆస్తిని కాజేయడానికి పథకం పన్నిన శ్రీధర్ వర్మకు అతని ఇద్దరు భార్యలు సహకరించారు. సొంత అక్కను బెదిరించి ఆస్తిని కాజేయాలనే ప్లాన్‌కు తులసి సోదరి రేవతి సహకరించింది. తులసికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఈ ఇంటికి క్షత్రియ సేవా సంఘం నుంచి నిర్మాణ సామాగ్రిని అందిస్తున్నట్టు నమ్మించారు.ఈ క్రమంలో శవాన్ని ఇంటికి పంపడం ద్వారా తులసిని భయపెట్టాలని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో శవం దొరక్క పోవడంతో ఒంటరిగా ఉంటున్న పర్లయ్యను హత్యచేసిన ఆ శవాన్ని చెక్కపెట్టెలో తులసి ఇంటికి పంపారు. మొదటి రోజు వర్షంలో కారు టైర్ పంక్చర్ కావడంతో పెట్టెను గాంధీనగరంలో ఇంట్లో ఉంచారు. మర్నాడు ఆటోలో యండగండిలోని తులసి ఇంటికి పార్సిల్ పంపారని ఉండి పోలీసులు వివరించారు.ఎలక్ట్రిక్ సామానులు వచ్చాయని చెక్క పెట్టె తెరిచిన తులసికి అందులో శవం చూసి భయపడింది. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న శ్రీధర్ వర్మ శవం విషయం బయటకు పొక్కకుండా తాను చూసుకుంటానని ఆస్తి పత్రాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేశారు. సంతకాలు చేయకపోతే ఆమెను కూడా శవంగా మారుస్తామని బెదిరించారు. ఫోన్ కూడా లాగేసుకోవడంతో తులసి షాక్‌కు గురైంది. ఈ లోపు టాయ్‌లెట్‌కు వెళ్తానని చెప్పిన తులసి మరో ఫోన్ నుంచి గ్రామస్తులకు సమాచారం అందించింది. దీంతో తులసి ఇంటికి కొందరు చేరుకోవడంతో శ్రీధర్యండగొండిలో శవం విషయం బయటకు పొక్కడంతో శ్రీధర్ వర్మ మూడో భార్య సుష్మ, కూతురితో కలిసి కృష్ణాజిల్లా బంటుమిల్లి మీదుగా మంగినపూడి చేరుకున్నాడు. తాళ్లపాలెంలో కారును విడిచి గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. పోలీసులు ఆరా తీయడంతో గ్రామంలోకి కొత్తగా వచ్చిన వారి గురించి పోలీసులకు సమాచారం అందింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించడంతో కేసు మిస్టరీ వీడింది. నిందితుడి బ్యాంకు ఖాతాల్లో కోట్ల నగదు ఉండటం గుర్తించిన పోలీసులు అతని వ్యవహారాలపై ఆరా తీస్తున్నారు.

# ఆలయం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు

**కరీంనగర్ :** వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. మొన్న రాజన్న కోడలు అక్రమంగా విక్రయానికి గురైన ఘటన మరిచిపోక ముందే ఆలయంలోని హుండీలో నగదు మాయం కలకలం సృష్టిస్తుంది. మరోవైపు మాంసాహారం ఆలయ ఆవరణలో పంపిణీ విమర్శలకు తావిస్తుంది.దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ లో వరుస ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్యలు సాగుతుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తుంది. నిత్యం వేలాది మంది భక్తులు సందర్శించే రాజన్న ఆలయంలో అధికారుల నిర్లక్ష్యం, నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.గర్భాలయంలోని హుండీల నుంచి నగదు చోరీ అధికారుల నిర్లక్ష్యానికి, నిఘా వైఫల్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. వారంలో మూడు సార్లు హుండీల నుంచి మైనర్లు డబ్బులు తీసుకుపోతుంటే నిఘా కెమెరాలు, భద్రతా సిబ్బంది, హడావిడి చేసే ఆలయ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొక్కుబడి చర్యలతో చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తి భావంతో భక్తులు సమర్పించే కానుకలు చోరీకి గురికావడం, కోడెలు అక్రమంగా విక్రయించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.ప్రస్తుతం హుండీలో నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరు మైనర్లను పోలీసులు గుర్తించారు. అరెస్టు చేసి జువెనైల్ కు తరలించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గతంలో పలువురు హుండీలలోని నగదు కాజేసి కటకటాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఓవైపు కోడెల గోల నడుస్తుంటే, ప్రస్తుతం హుండీలోని నగదు మైనర్లు ఎత్తుకెళ్లడం అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుంది.మరోవైపు ఆలయ ఆవరణలో మాంసాహారం పంపిణీ వివాదాస్పదంగా మారింది. క్రిస్మస్ రోజున ఆలయ ఆవరణలో చికెన్ రైస్ ఎగ్ రైస్ గుర్తుతెలియని వ్యక్తులు పంపిణీ చేశారు. అన్యమత ప్రచారం అంటూ సర్వత్రా ఆందోళన వ్యక్తం కావడంతో అప్రమత్తమైన పోలీసులు, ఆలయ అధికారులు విచారణ చేపట్టారు. చివరకు చికెన్ రైస్ ఎగ్ రైస్ ఆలయ ఆవరణలో పంపిణీ చేయలేదని బయట పంపిణీ చేసిన దాన్ని నిత్యం అక్కడ అడుక్కునే నిరుపేద భక్తులు ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చినట్లు స్పష్టం చేశారు. మరోసారి అలా జరగకుండా కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.ఆలయ అధికారులు, నిఘా వర్గాలు చేతులుకాలక ఆకులు పట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకుండా హుండీలో నగదు మాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసి? ఆలయ ఆవరణలో మాంసాహారం పంపిణీతో శుద్ధిచేసి సంప్రోక్షణ నిర్వహించారు. ఇకనైనా అధికారులు మేల్కొని పకడ్బందీ చర్యలు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిచో ఆందోళన చేపట్టక తప్పదని విశ్వహిందూ పరిషత్, బిజెపి నాయకులు హెచ్చరించారు.మరోవైపు గత నెలలో రైతుల పేరిట రాజన్న కోడెలు పొంది అక్రమంగా విక్రయించిన విషయంపై అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసి అక్రమంగా కోడెలు పొందిన వారి నుంచి 26 కోడెలు స్వాధీనం చేసుకుని రాజన్న గోషాలకు తరలించారు.మరోవైపు ఏడాది కాలంగా రాజన్న కోడెలు 1975 పొందిన వారు రైతులా, రైతుల మసుగులో దళారులా అని తేల్చేందుకు సమగ్ర సర్వే చేపట్టారు. సర్వే కోసం 20 మందిని నియమించి తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాలకు, జిల్లాకు ఇద్దరు చొప్పున నియమించి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు నివేదిక సమర్పించనున్నారు. కలెక్టర్ సైతం రాజన్న గోశాలను సందర్శించి పశువుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆలయ అధికారులను, పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.

# సినిమాలు అలా తీయడం సాధ్యమేనా

**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డితో చిత్ర ప్రముఖుల భేటీ విఫలం అనే చెప్పాలి. వారు కోరుకున్నది జరక్కపోగా కొత్త ఆంక్షలు మోపి పంపారు . అయితే రేవంత్ రెడ్డి చెప్పినట్లు సినిమాలు తీయడం సాధ్యమేనా అనే ప్రశ్న మొదలైంది.సంధ్య థియేటర్ ప్రమాదంలో మహిళ మృతి చెందిన నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవు. టికెట్స్ పెంపుకు కూడా అనుమతులు ఇవ్వమని తేల్చి చెప్పాడు. మరో రెండు వారాల్లో సంక్రాంతి సినిమాల విడుదల ఉంది. గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలు విడుదల కానున్నాయి. ఈ చిత్రాలపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపనుంది.అలాగే భవిష్యత్తులో టాలీవుడ్ లో తెరకెక్కే భారీ బడ్జెట్ చిత్రాలు నష్టపోతాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి తన నిర్ణయంపై పునరాలోచన చేయాలి. ఆయన్ని బెనిఫిట్ షోలు, టికెట్స్ హైక్ కి ఒప్పించాలని భేటీ అయ్యారు. ఎఫ్ డీ సీ చైర్మన్ దిల్ రాజు నేతృత్వంలో దర్శక నిర్మాతలు, హీరోలు రేవంత్ రెడ్డిని కలిశారు. ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు.రేవంత్ రెడ్డి చిత్ర ప్రముఖుల ఆశలపై నీళ్లు చల్లారు. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన ప్రతిపాదనలు, విధించిన ఆంక్షలు షాక్ ఇచ్చేలా ఉన్నాయి. శాంతి భద్రతల విషయంలో రాజీ పడేదిలేదన్న రేవంత్ రెడ్డి? అసెంబ్లీలో చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నానని నిర్మొహమాటంగా చెప్పారు. టికెట్స్ హైక్ తో పాటు బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వడం కుదరదు అన్నారు. ప్రయోజనం కోరి వెళ్లిన చిత్ర ప్రముఖులకు ఆయన పెట్టిన ఆంక్షలు మరింత ఆందోళనకు గురి చేశాయి.హీరోలు తమ



పాపులారిటీ వాడి తెలంగాణకు పెట్టుబడులు తేవాలి. టూరిజం డెవలప్ చేయాలి. ప్రతి సినిమా హీరో తమ మూవీ విడుదలకు ముందు డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా క్యాంపైన్ చేయాలని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిని ఒక సోషల్ రెస్పాన్సిబిలిటీగా భావించి, ఆ దిశగా అడుగులు వేయాలని అన్నారు. స్టార్ హీరోల బౌన్సర్స్ పబ్లిక్ కి హానీ కలిగించేలా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదు. ఇకపై వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. అలాగే అభిమానులను హీరోలు కంట్రోల్ లో పెట్టుకోవాలి. నేతలపై సోషల్ మీడియాలో దూషణలకు పాల్పడకుండా అదుపు చేయాలని సూచించారు.ఇవన్నీ పర్లేదు. కాగా సినిమాల్లో అసాంఘిక కార్యక్రమాలతో కూడిన సన్నివేశాలు. పాత్రలు ఉండకూడదని ఆయన హుకుం జారీ చేశాడట. డ్రగ్స్ వాడకంతో పాటు యాంటీ సోషల్ ఎలిమెంట్స్ లేకుండా చూసుకోవాలని చెప్పారట. స్టార్ హీరోల సినిమాలన్నీ వీటితోనే నిండి ఉంటాయి. త్వరలో రానున్న చిత్రాల్లో కొన్ని చిత్రాల్లో గ్యాంగ్ స్టర్ రోల్స్ చేస్తున్నారు. అది కూడా యాంటీ సోషల్ ఎలిమెంటే. ఫ్యాక్షన్ సబ్జెక్టులు, క్రైమ్ థ్రిల్లర్స్ కూడా ఈ కోవకే వస్తాయి. అసలు చెడు అనేది మచ్చుకైన లేకుండా సినిమాలు తీయడం సాధ్యమయ్యే పనేనా అనే వాదన తెరపైకి వచ్చింది.

# రెండు రోజులు జరాభద్రం./. వాతావరణ శాఖ వార్నింగ్

**హైదరాబాద్ :** తెలంగాణ వెదర్‌పై హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు కీలక అప్డేట్ ఇచ్చారు. రాష్ట్రంలో రానున్న 5 రోజులు అక్కడక్కడ ఉదయం వేళ పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-4 డిగ్రీలు పడిపోతాయని హెచ్చరించారు. రేపు, ఎల్లుండి పొగమంచు ఎక్కువగా ఉంటుందని రేపు 20-27 డిగ్రీలు, ఎల్లుండి 18-27 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు అంచనా వేసారు. తూర్పు/ఆగ్నేయ దిశలో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో నేడు పలు చోట్ల తేలికపాటి వర్షాలకు ఛాన్స్ ఉన్నట్లు వెల్లడించారు. ఎలాంటి హెచ్చరికలు లేకపోయినప్పటికీ.. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారుఇక నైరుతి, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీర ప్రాంతాలలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడినట్లు భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం అదే ప్రాంతంలో ఇప్పుడు సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ వరకు విస్తరించి ఉందని అన్నారు. దీని ఫలితంగా ఏపీలో వర్షాలు కురుస్తాయన్నారు. ఉత్తర కోస్తాలో నేడు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అంచనా వేశారు. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని.. ఈదురు గాలులు గంటకు 30-40 కిలోమీటర్లు.. గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో గత మూడ్రోజులు వర్షాలు కురిశాయి. వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షం తీవ్రత ఎక్కువగా ఉంది. బుధవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం నగరంలో పొడి వాతావరణం నెలకొని ఉంది. మేఘాలు లేకపోవటంతో చలి తీవ్రత కాస్త పెరిగింది. రానున్న రోజుల్లో ఇదే వాతావరణం ఉంటుందని.. చలి తీవ్రత పెరిగే ఛాన్స్ ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు అలర్ట్ జారీ చేశారు.

## రేవంత్ ధైర్యం ఏమిటీ?

-మొదటిపేజీ తరువాయి

వారి మాట వినకపోవడం వంటి వాటితో తనపైన ఉన్న ముద్రను చెరిపేసుకోవడం ప్రధాన లక్ష్యంగా రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లే కనిపిస్తుంది. టాలీవుడ్ విషయంలో రేవంత్ రెడ్డి ఫర్మ్ గా ఉన్నారు. టాలీవుడ్ అంటే ఎక్కువగా ఒక సామాజికవర్గం డామినేషన్ అని అందరికీ తెలిసిందే. అయితే చిరంజీవి కుటుంబం, దిల్ రాజు ఫ్యామిలీ ఒకింత మినహాయింపు ఇచ్చినా ఎక్కువ మంది వారే. అలాగని చూసీ చూడనట్లు వెళితే చంద్రబాబు డైరెక్షన్ లో నడుస్తున్నానన్న ప్రచారాన్ని ప్రత్యర్థులు చేసే అవకాశముంది ... అందుకే ఆ అవకాశం ప్రత్యర్థులకు ఇవ్వకూడదని రేవంత్ రెడ్డి భావించినట్లుంది. అందుకు అల్లు అర్జున్ ఎపిసోడ్ కలసి వచ్చింది. టాలీవుడ్ ను ఒక నొక్కు నొక్కితే కొంత ఈ ముద్ర నుంచి బయటపడే అవకాశముంది. టాలీవుడ్ తో ఇటీవల జరిగిన సమావేశంలో ఎక్కువ మంది తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులే. అంటే తన పాత పార్టీకి చెందిన వారే. వారందరూ రేవంత్ రెడ్డికి తెలియంది కాదు. నాగార్జున మినహా మురళి మోహన్, రాఘవేంద్రరావు లాంటి వారు నేరుగా టీడీపీతో సంబంధం ఉన్న వారే. అందుకే తెలివిగా రాఘవేంద్రరావును, మురళీ మోహన్ ను కూడా టాలీవుడ్ నుంచి తీసుకువచ్చారు. కనీసం వీరిద్దరి మాటలను అయినా కొంత రేవంత్ రెడ్డి వింటారని భావించి ఉంటారు. అయితే ఈ సమావేశంలో తాను చెప్పాలనుకున్నది చెప్పేసి రేవంత్ రెడ్డి వెళ్లిపోయారు. వారు చెప్పినవి విన్నప్పటికీ టిక్కెట్ ధరలను పెంచడానికి, బెనిఫిట్ షోలను అనుమతించడానికి మాత్రం ఒప్పుకోనని తెగేసి చెప్పడంతో రేవంత్ రెడ్డి తానింతేనని సంకేతాలను ఇటు టీడీపీ అధినేతకు కూడా పంపగలిగాడు. తెలంగాణ సమాజానికి కూడా అది అర్థమయింది. అలాగే ఎక్కువ మంది తెలంగాణ కళాకారులు, నిర్మాతలు సమావేశంలో ఉండేలా కూడా జాగ్రత్తలు పడినట్లే కనిపించింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి తనకు పదవి కంటే ఏదీ ముఖ్యం కాదన్న విషయాన్ని పరోక్షంగా కుండ బద్దలు కొట్టినట్లయింది. అందుకే టాలీవుడ్ పెద్దలు ఏదో ఆశించి వచ్చినా నిరాశతో వెనుదిరిగారు. హైదరాబాద్ ను అంతర్జాతీయ సినిమాకు హబ్ గా చేయాలని, దానికి రూట్ మ్యాప్ రూపొందించాలని చెప్పి పంపి రేవంత్ రెడ్డి తనలోని అసలైన రాజకీయ నేతను వారికి చూపించారు.

## సంక్రాంతి తర్వాత మహోద్యమమే..



-మొదటిపేజీ తరువాయి

దుస్థితి వచ్చిందని.. దీంతో ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారని చెప్పారు. సంక్రాంతిలోపు బకాయిపడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి ప్రభుత్వం మెడలు వంచి తీరుతామని అల్టిమేటం జారీ చేశారు. అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ మండిపడ్డారు. ఇప్పటివరకు 25 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి.. 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు గప్పాలు కొడుతోందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిరుద్యోగులు ఉద్యోగాల్లేక ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొనడం బాధాకరమని అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ తుంగలో తొక్కిందని మండిపడ్డారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తామని మాట తప్పిందన్నారు. ఒక్కో నిరుద్యోగికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.48 వేలు బకాయి పడిందని.. బకాయి పడ్డ ఆ డబ్బును వెంటనే నిరుద్యోగులకు ఇవ్వాలని సూచించారు. అలాగే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

**మన్మోహన్ అంత్యక్రియలపై కాంగ్రెస్ రాజకీయాలు చేయడం సిగ్గుచేటు**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై కాంగ్రెస్ రాజకీయం చేయడం సిగ్గుచేటు అని బండి సంజయ్ విమర్శించారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్న పదేళ్లు సూపర్ ప్రధానిగా సోనియాగాంధీ కొనసాగుతూ రబ్బర్ స్టాంప్‌గా మార్చేసిందని ఆరోపించారు. అలాగే మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రజాప్రతినిధ్యం చట్టంలోని నిబంధనలను సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకొస్తే.. ఆ ఆర్డినెన్స్ కాపీలను రాహుల్ గాంధీ చింపివేసి మన్మోహన్‌ను దారుణంగా అవమానించారని అన్నారు. కానీ మన్మోహన్ సింగ్ సేవలను గుర్తించి అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించి ఆయనకు ఢిల్లీలోనే స్మారక స్థల్ నిర్మించేందుకు సిద్ధమైందని తెలిపారు. మాజీ ప్రధానిగా పనిచేసిన పీవీ నర్సింహారావు అంత్యక్రియలను ఢిల్లీలో నిర్వహించకుండా అవమానించిన కాంగ్రెస్ పార్టీకి.. మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత లేదని అన్నారు.

## సంక్రాంతికే రైతు భరోసా..




-మొదటిపేజీ తరువాయి

తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహా వ్యవసాయ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా.. రైతు భరోసా విధివిధానాలపై కేబినెట్ సబ్‌కమిటీ గంటన్నరపాటు చర్చించింది. సంక్రాంతికే రైతు భరోసా ఇవ్వాలని మంత్రి వర్గం సబ్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసింది. అయితే.. రైతు భరోసా విధివిధానాలపై మరోసారి భేటీ కావాలని సబ్ కమిటీ నిర్ణయించింది.. అయితే.. సాగు భూమికే రైతు భరోసా ఇవ్వాలనే యోచనలో ఉన్న రేవంత్ సర్కార్.. ఎన్ని ఎకరాల వరకు అమలు చేయాలనే విషయంపై మాత్రం క్లారిటీకి రాలేకపోతోంది. ఈ క్రమంలోనే.. మరోసారి సమావేశమై రైతు భరోసాపై నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ సబ్‌కమిటీ డిసైడ్ అయింది. అయితే.. టాక్స్ పేయర్స్, ప్రభుత్వ ఉద్యోగులను రైతు భరోసా అనర్హులుగా ప్రకటించాలని సూచనప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది.. ఇక.. సంక్రాంతికి రైతు భరోసా ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఫిక్స్ అయింది. ఈ క్రమంలోనే.. రైతు భరోసా ఎవరికి ఇవ్వాలని, ఎవరికి ఇవ్వొద్దనే దానిపై ఫోకస్ పెట్టింది. గూగుల్ డేటా, శాటిలైట్ ఆధారంగా సాగు విస్తీర్ణం లెక్కించేందుకు పలు కంపెనీల నుంచి డేటా సేకరిస్తోంది. తాజాగా.. డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ భేటీ అయింది. అయితే.. మరోసారి సమావేశం కావాలని డిసైడ్ అయిన నేపథ్యంలో రైతు భరోసాపై కేబినెట్ సబ్ కమిటీ ఎలాంటి రిపోర్ట్ ఇస్తుందనేది ఆసక్తి రేపుతోంది.

## సంపాదకీయం


### ధరల నిర్ణయాధికారంతోనే

# సాగు బాగు

మానవుని జీవన విధానం వ్యవసాయంతో ముడిపడి ఉన్నది. మానవుడి నాగరిక జీవితానికి వ్యవసాయమే మూలాధారం. సింధు లోయ నాగరికత నుంచే మన దేశంలో వ్యవసాయం ప్రధాన జీవన ఆధారంగా ఉండేది. ఆ కాలంలో అన్నదాతలు సిరిసంపదలతో వర్ధిల్లేవారు. ఆధునిక భారతదేశంలో వ్యవసాయ రంగంలో సాంకేతికత అభివృద్ధి వల్ల పెనుమార్పులు సంభవించాయి. వ్యవసాయ రంగం దేశ ప్రగతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడుతున్నది. అందువల్లే వ్యవసాయ రంగాన్ని దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా పరిగణిస్తారు. దేశాన్ని కాపాడుకోవడంలో రైతు కీలక పాత్ర పోషిస్తున్నాడు. అది స్వతంత్ర పోరాటమైనా, కరువుకాటకాలైనా, ఎలాంటి పరిస్థితుల్లోనైనా అన్ని తానై ముందుండి దేశ ప్రజలను రక్షించడంలో రైతుల పాత్ర వెలకట్టలేనిది. నిత్యం శ్రమిస్తూ దేశ ప్రజలకు అన్నం పెట్టడంలో రైతుకు సాటి ఎవ్వరూ లేరు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇంచుమించు 50.82 మిలియన్ టన్నులు ఉండగా.. రైతుల నిరంతర శ్రమ వల్ల 2023-24 నాటికి 332.32 మిలియన్ టన్నులకు చేరుకున్నది. మన దేశంలో సుమారుగా 80.54 కోట్ల మంది ఉచితంగా ఆహార ధాన్యాలను పొందుతున్నారంటే వారి కృషి ఫలితమే. సంవత్సర తలసరి నికర ఆహార ధాన్యాల లభ్యత 1950లో 144.1 కిలోగ్రాములు కాగా.. 2023 నాటికి అది 207.6 కిలోగ్రాములకు చేరింది. అంటే దినసరి తలసరి నికర ఆహార ధాన్యాల లభ్యత 568.8 గ్రాములు. ఈ విధంగా కర్షకులు దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కానీ, వారు మాత్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. పంట విత్తిన సమయం నుంచి కోతకోసి అమ్మే వరకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక హెక్టార్ విస్తీర్ణంలో వరి సాగుకు కౌలు, కుటుంబ శ్రమ కలుపుకొని సుమారు రూ.లక్ష పెట్టుబడి అవుతున్నది. అందులో అధికంగా కూలీలకు (22.1%), ఎరువులకు (20.8%), విత్తనాలకు (11.5%), మందులకు (8.3%) ఖర్చవుతుంది. దేశ వ్యవసాయ కూలీ సగటు రోజువారీ వేతనం రూ.361.52 (2022-23 గణాంకాలు). నమ్మలేని నిజం ఏమిటంటే మన దేశంలో వ్యవసాయ కూలీ ఆదాయం కంటే రైతు ఆదాయం తక్కువ. వ్యవసాయ ఖర్చులు పెరగడం అన్నదాతలకు ప్రధాన సమస్యగా మారింది. ఉదాహరణకు ఒక హెక్టార్ విస్తీర్ణంలో వరి సాగుకు కౌలు, కుటుంబ శ్రమ కలుపుకొని సుమారు రూ.లక్ష ఖర్చు అవుతున్నది. అందులో అధికంగా కూలీలకు (22.1%), ఎరువులకు (20.8%), విత్తనాలకు (11.5%), మందులకు (8.3%) ఖర్చవుతుంది. వ్యవసాయ కూలీ సగటు రోజువారీ వేతనం రూ.361.52 (2022-23 గణాంకాలు). నమ్మలేని నిజం ఏమిటంటే మన దేశంలో వ్యవసాయ కూలీ ఆదాయం కంటే రైతు ఆదాయం తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2019లో వ్యవసాయ కుటుంబ సగటు నెలసరి ఆదాయం రూ.10,218 మాత్రమే. మన దేశంలోని 50.2 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో చిక్కుకున్నాయి. అందులోనూ 82.9 శాతం చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలే కావడం గమనార్హం. దేశంలో రైతుల సగటు అప్పు రూ.7,412. అదేవిధంగా రెండు తెలుగు రాష్ట్రాల వ్యవసాయ కుటుంబాలు దేశంలోనే అత్యధిక శాతం అప్పుల బారినపడ్డాయని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. రైతుల అప్పుల్లో 69.9 శాతం సంస్థాగత రుణాలు కాగా.. మిగతా 30 శాతం రుణాలు వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, భూస్వాములు, చిట్ ఫండ్ కంపెనీలు ఇచ్చినవే. పెట్టుబడికి డబ్బులు లేక, సంస్థాగత రుణాలు సమయానికి అందకపోవడంతో వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకొని అప్పుల పాలవుతున్నారు. అప్పుల భారం తట్టుకోలేక చివరికి ఆత్మహత్య చేసుకుంటున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం.. 2022లో సుమారు 11,290 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దేశ రైతాంగాన్ని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్న తరుణంలో వాటిని అధిగమించి అన్నదాతల ఆదాయం పెంచాలంటే వ్యవసాయ రంగంలో నూతన సంస్కరణలు, సాకేతికత వినియోగం తక్షణావసరం. సాగు ఖర్చులు, పంట కొనుగోలు, గిట్టుబాటు ధర, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థ లాంటి అనేక అంశాల మీద సమగ్ర సంస్కరణలు తీసుకురావాలి. ప్రత్యేకించి, స్థానిక సమస్యలకు అనుగుణంగా వ్యవసాయ సంస్కరణలు ఉండాలి. ముఖ్యంగా పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలి. ఒకవేళ పంటను ప్రైవేట్ వ్యాపారులు, దళారులు కొన్నప్పుడు తప్పనిసరిగా ఆ ధరలు, కనీస మద్దతు ధర కంటే అధికంగా ఉండేటట్టు చట్టాలను తీసుకురావాలి. విత్తనాల కొనుగోలుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ప్రభుత్వ సంస్థల నుంచి రైతులకు సమయానికి, సరిపడా విత్తనాలు లభించడం లేదు. 2023లో 464.14 లక్షల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అవసరం ఉండగా, ప్రభుత్వ సంస్థల నుంచి 133.84 లక్షల క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారుల నుంచి 380.41 లక్షల క్వింటాలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. రైతులకు సరిపడా విత్తనాలను అందించేందుకు ప్రభుత్వ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో మరిన్ని విత్తన ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అదేవిధంగా, నేల సారవంతం చేసేందుకు, చీడపీడల నివారణకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఈ రకమైన ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగా సమగ్ర సస్యరక్షణ, పోషక నిర్వహణ కిట్లను అందజేయడం ద్వారా ఖర్చులను కొంతమేరకు తగ్గించవచ్చు. అంతేకాకుండా, వ్యవసాయ కూలీల ఖర్చును తగ్గించడానికి యంత్రాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. అందుకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ముందుకు రావాలి. తక్కువ ధరలకు యంత్రాలను అందుబాటులోకి తేవాలి. సంప్రదాయ వ్యవసాయంలోని మెలకువలు, నైపుణ్యాలను కొనసాగిస్తూనే.. సాంకేతిక పరిజ్ఞానాన్ని పంటల సాగుకు ఉపయోగించడం వల్ల వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించవచ్చు. ఆధునిక డిజటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి సేద్యంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. వ్యవసాయ డిజిటలీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌తో రానున్న దశాబ్దాల్లో దేశ వ్యవసాయ రంగం నూతన రూపం సంతరించుకోబోతున్నది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లోని అగ్రిస్టాక్ దేశ వ్యవసాయానికి సంబంధించిన బృహత్తర సమాచార నిధిగా మారబోతున్నది. అగ్రిస్టాక్ ద్వారా సేకరించిన సమాచారం డిజిటల్ వ్యసాయానికి పునాది కాబోతున్నది. కృత్రిమమేధ, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్ లాంటి అనేక సాంకేతిక విధానాలను సాగుకు సంబంధించిన నిర్ణయాలను తీసుకోవడానికి, అవరోధాలను పసిగట్టి నివారించడానికి ఉపయోగించవచ్చు. స్మార్ట్ ఫార్మింగ్‌లో భాగంగా వివిధ అప్లికేషన్లను ఉపయోగించి ఉచితంగా విత్తన రకాలను ఎంచుకోవడం, నేలల రకాలకు అనుగుణంగా ఎరువుల వాడకం, తెగుళ్లను, పురుగులను గుర్తించడం, సరైన మందులను పిచికారీ చేయడం, వాతావరణంలోని మార్పులను తెలుసుకోవడం, దిగుబడులను అంచనా వేసి మార్కెట్లోని ధరల హెచ్చుతగ్గులను తెలుసుకోవచ్చు. అందుకు రైతులకు డిజిటల్ పరిజ్ఞానం చాలా అవసరం. కాబట్టి, దేశంలోని అన్నదాతలకు అందుకు అవసరమైన శిక్షణ ఇచ్చి కనీస అవగాహన కల్పించాలి. ఆధునిక భారతదేశం సాంకేతికత పరంగా అభివృద్ధి సాధించినప్పటికీ, రైతాంగం స్థితిగతులను మార్చే విషయంలో అది ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. వ్యవసాయ రంగంలో సాంకేతికతను కొంతవరకు ఉపయోగిస్తున్నప్ప టికీ ఆశించిన ఫలితాలు మాత్రం రావడం లేదు. రైతులు లాభపడాలంటే సాగుకు సాంకేతికత తోడవ్వాలి. అంతేకాదు, కర్షకుల చిరకాల స్వప్నమైన పండించిన పంటకు ధరలు తామే నిర్ణయించుకునే స్థితి వస్తేనే వ్యవసాయం సస్యశామలమై అన్నదాతల ఆదాయం పెరుగుతుంది. దేశం సుభిక్షంగా వర్ధిల్లుతుంది.

### నిరుద్యోగుల సమస్యలపై

# నోరు మెదపరేం?



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే విద్యారంగం భ్రష్టుపట్టిపోయింది. గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కలుషితాహారం తిని ప్రాణాలు కోల్పోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో గురుకులాల్లో సీటు రావటాన్ని గొప్పగా భావించిన తల్లిదండ్రులు ఇప్పుడు మాత్రం వాటి పేరు ఎత్తితేనే భయపడతున్నారు. రాష్ట్రంలో ఏదో ఒకచోట కలుషితాహారం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురవటం పరిపాటిగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన విద్య అందించటం వల్ల గురుకులాల విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షా పోటీల్లో విజయం సాధించారు. ఆ స్ఫూర్తిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా దెబ్బతీసింది. బడ్జెట్ కేటాయింపుల్లో మిగతా రాష్ట్రాలు విద్యారంగానికి సగటున 14.8 శాతం నిధులు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందులో సగం అంటే 7.6 శాతం మాత్రమే కేటాయించింది. బలమైన జాతిని నిర్మించటానికి నేటి విద్యార్థులే ముఖ్యమన్న విషయాన్ని ఈ ప్రభుత్వం మర్చిపోయింది. అధికారంలోకి వస్తే ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామన్న రేవంత్ రెడ్డి%ొ% ఇప్పటివరకు గత ప్రభుత్వంలో వచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు ఇవ్వటానికే పరిమితమయ్యారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల నియామకాలు పూర్తి చేస్తామన్న ఆయన ఇప్పుడు మాత్రం 30 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్లు విడుదల చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ లాంటి వారిని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ గల్లీల్లో తిప్పి మరీ ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుతం నియామకాల మీద నోరు మెదపట్లేదు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని హామీలు కాగితాల మీదే మిగిలిపోయాయి. తెలంగాణ డిగ్రీ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇవ్వాల్సిన రూ.5,900 కోట్ల బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రేవంత్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నాణ్యమైన విద్యను విద్యార్థులు అందుకోలేకపోతున్నారు. ఈ సంవత్సర కాలంలో చాలా కాలేజీలు మూతపడటం రాష్ట్రంలోని విద్యారంగం దుస్థితికి నిదర్శనం. గత పదేండ్లలో తెలంగాణలో విద్యాసంస్థల సంఖ్య భారీగా పెరగగా.. ఈ ఒక్క ఏడాదిలోనే అనేక ఫార్మా, డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలు మూతపడ్డాయి. వాటికి రావాల్సిన బకాయిలను విడుదల చేయటంలో రేవంత్ ప్రభుత్వం చేస్తున్న తాత్సారమే దీనికి కారణం.

జాతీయ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్‌లో తెలంగాణ నుంచి ఏ ఒక్క ప్రభుత్వ విశ్వవిద్యాలయం కూడా టాప్- 100లో స్థానం పొందలేకపోయింది. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లించే పరిస్థితి లేదు. ఇక సర్వశిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న సిబ్బంది కూడా సమ్మె బాటపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు మెస్ ఫీజులను విడుదల చేయటానికి కూడా రేవంత్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. సుమారు 13 లక్షల మంది విద్యార్థులు తమకు రావాల్సిన స్కాలర్‌షిప్ కోసం ఎదురుచూస్తున్నారు. అధికారపేక్షతో అలవికాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకమైన విద్యా శాఖను భ్రష్టుపట్టిస్తున్నది. ఇప్పటి వరకు విద్యా శాఖ మంత్రిని నియమించకుండా ముఖ్యమంత్రి తన దగ్గరే ఆ శాఖను ఉంచుకోవటం సరికాదు. ఇప్పటికైనా సమర్థులకు ఆ శాఖను కేటాయించి విద్యా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను తిరిగి అమల్లోకి తీసుకువస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పెండింగ్ డీఏలను విడుదల చేయాల్సి ఉన్నా పట్టించుకోవట్లేదు. ఉద్యోగులు 51 శాతం ఫిట్‌మెంట్ బెనిఫిట్ కోసం ఎదురుచూస్తున్నారు. హెల్త్‌కార్డులు, బీమా సౌకర్యాలు సరిగా అందట్లేదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నా ఈ ప్రభుత్వం ఏ మాత్రం కనికరం చూపించట్లేదు. గత ప్రభుత్వంపై నిరాధర ఆరోపణలు చేసి పదవులు పొందిన నాయకులు ఇప్పుడు విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై నోరు మెదపట్లేదు. ఇప్పటికైనా తెలంగాణ బుద్ధిజీవులు, విద్యావేత్తలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉన్నది.

# మారుపాకలో బాల్య మధురిమలు



నా చిన్ననాటి జ్ఞాపకాలు, వేములవాడ మండలం మారుపాక గ్రామం - కోనరావుపేట మండలం నాగారం గ్రామాల నుండి మొదలవుతాయి. అందులో మారుపాకలో మా కుటుంబం నివసించిన ఊరి ఆవలి గుడిసె ప్రత్యేకం. మాకు రెండు గ్రామాలలో ఆస్తులు ఉన్నాయి. పంచుకుంటే మారుపాకలో ఇళ్లు (గడీ) రాలేదు. అందుకే ఊరి బయట గుడిసెలో కాలం గడిపి నాగారంలో ఒక చిన్న ఇల్లు కట్టారు. అయితే మా తాత గారు (అమ్మ తండ్రిగారు) ఇంటి నిర్మాణానికి బాగా సహాయం చేశారని చెబుతుండేవారు. ఆ గ్రామం పెద్ద అడవిలో ఉండేది కాబట్టి ఎక్కువ కాలం మారుపాకలో గుడిసెలోనే కాలం గడిచిపోయింది. కానీ చివరికి నాన్న నాగారంలోనే చనిపోవడం జరిగింది. అందుకే ఆ గ్రామాన్నే నా వ్యవసాయ క్షేత్రంగా ఎంచుకున్నాను. ఎన్నిసార్లో ఆ గ్రామాన్ని వదిలిపెట్టే పరిస్థితులు వచ్చినా నన్ను మాత్రం వెంటాడి తిరిగి గ్రామానికి తెచ్చుకున్నది నాగారం గ్రామం. ఆ అనుబంధం కూడా చెరిగిపోనిది. ఆర్థికంగా ఎంతో నష్టం జరిగినా సంతోషంగా భరించాను. నా సమయం వృథా అయినా, ఎంతో మంది తీవ్రమైన విమర్శలు చేసినా నాకు మాత్రం సంతృప్తినిచ్చింది నాగారం. మారుపాక గుడిసెలలో పొద్దున్నుంచి రాత్రి పడుకునే వరకు దోమలు, ఈగలు, కోళ్లు, పశువులు, లేగదూడలు, చెట్లు, చేమలు, పువ్వులు, పొదలు, పురుగులు దాదాపు వెన్నంటే ఉండేవి. అప్పుడప్పుడు తేళ్లు, పాములు దర్శనమిచ్చేవి. చాలా వరకు పారిపోయేవి. దొరికిన వాటిని చంపేవారు. అప్పుడు సినిమాలు, టీవీలు లేవు కాబట్టి సమయం అంతా పరిసరాల కమనీయ దృశ్యాలే కంటి నిండ కదలాడేవి. వర్షాకాలం రాగానే ముళ్ల కంపతో గుడిసె చుట్టూ కొంచెం ఎత్తుతో గోడ మాదిరి నిర్మాణం చేసి, చిన్నగా దాన్ని ఒక చోట వదిలి కట్టెలలో చిన్న తలుపు మాదిరిగా అడ్డం ఉంచేవారు. మా గుడిసెకు తలుపు, తాళం లేదని గర్వంగా రాసుకుంటున్నాను. ముళ్లకంప పైన రకరకాల మొక్కలు తీగలు పారి పువ్వులు పూసి, కాయలు కాసి కంపను కనపడకుండా దాచేవి. గుడిసె చుట్టూ అల్లుకుపోయిన పచ్చదనం, పువ్వుల అందం కొన్ని మాసాలు అద్భుతంగా ఉండేది. విద్యుత్ లేదు కాబట్టి రాత్రి కిరోసిన్ నూనెతో ఎక్కాలను, ఖందిల్లను వెలిగించేవారు. సాయంత్రం అయితేనే ఇది ఒక పెద్దపని. రాత్రిపూట మసిబడ్డ బుగ్గలను తుడవడం, కాలిన వత్తులను సరిచేయడం జాగ్రత్తగా నూనె పోయడం ఒక నైపుణ్యంతో కూడుకున్న పని. ఇంటి ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉన్న గూళ్లల్లో మట్టి ప్రమిదలలో నూనె పోసి ఇంట్లో దూదితో తయారుచేసిన వత్తులను వెలిగించేవారు. దేవుళ్ళ దగ్గర మట్టి మాణిక్యాలను వెలిగించేవారు. ఇవన్ని ఉన్నా ఎక్కువ సమయం చీకట్లోనే గడిచేది. వెన్నెల రాత్రులు ఎప్పుడెప్పుడని ఎదురుచూసేవాళ్లము. పంకాలు లేవు కాబట్టి ఉడకపోసినా సహజంగా అనిపించేది. వానకాలంలో కంపనాటడం, ఎండకాలంలో తీయడం, ఒక పెద్ద ప్రక్రియ. కంప తీయటానికి ఉపయోగించే రాగోల (పంగలాంటి పెద్ద కట్టె) పనితనం ఆకర్షణీయంగా ఉండేది. రాత్రిపూట చలికాలంలో గుడిసె ముందు కట్టెలు కాల్చి మంట పెట్టేవారు. అందులో ఒక పెద్ద మొద్దు ఎప్పుడూ మెల్లమెల్లగా కాలుతూనే ఉండేది. అవసరం అయినప్పుడు దాని పైననే ఎండిన పుల్లలు, ఒక చిన్న కంప, ఆకులు వేసి ఊదితే కొంతసేపు చలి కాపుకునే మంట వచ్చేది. దాని చుట్టు గుండ్రంగా కూర్చునేవారము. గుడిసె ముందు రోలు, రోకలి, గుడిసె లోపల కాగులు, కుండలు, కూజాలు, గిలాసలు, చెంబులు, గంగాలాలు, కొప్పెరలు, దేకీసలు, పొయ్యిలు, దాలి, శిబ్బి, కవ్వం, వేలాడుతున్న ఉట్లు, చల్ల కుండ, పల్లాలు, కూర్చుండే చాపలు, పండుకునే చాపలు, మంచాలు, పరుపులు, దుప్పట్లు, మెత్తలు, జంబుకానాలు, తెల్లవారంగానే బట్టలను చుట్టి ఒక్కొక్కదాన్ని గడెంచ మీద పేర్చేవారు. అల్మారాలు మాత్రం ఉండేవి కావు. మా నాన్న నవారు మంచం మీద, మిగిలిన వారందరం నులక మంచాల మీద, చాపల మీద పండుకునేవారం. పొద్దున లేవంగానే బొగ్గు పొడితో అందరం పండ్లు తోముకునేది. మా నాన్నగారు పండ్ల పుల్ల వేసుకునేది. పండ్ల పుల్లలు కట్టలుగా ఉంచేవారు. అందులో కొన్న యాప పుల్లలు, మధ్యలో ముద్రబెండ చెట్ల పుల్లలు ఉండేవి. అప్పుడప్పుడు అవి వేసుకొని మా గొప్పతనాన్ని ఎవరికీ తెలియకుండా చాటుకునేవారం. ఆ కాలం నుండే టీ త్రాగుటం అందరికి అలవాటు అయ్యింది. “దాలి” అనేది వంటింట్లో భూమిలో రెండు, మూడు అడుగుల లోతున చతురస్రాకారంలో త్రవ్వి దానిలో పిడకలు వేసి, పైన కుండ పెట్టి దానిలో పాలు పోసి, పిడకలకు నిప్పంటిస్తే అది పొద్దుటి నుండి మధ్యాహ్నం వరకు మెల్లమెల్లగా కాగుతుండేది. కుండకు ఒక శిబ్బి (మేదరి వాళ్లు అల్లినవి) అడ్డంగా మూత మాదిరి పెట్టేది. మొత్తం దాలిపైన సందులుగా కట్టెతో చేసిన తలుపుతో మొత్తం దానిని మూసేది. దానిని దాలిపైన ఉండే జాలి అని పిలిచేవారు. అది ఒక కట్టె కిటికిగా ఉండేది. పాలు పొంగి, మెల్లమెల్లగా కాగుతుండేవి. వేడి మాత్రం శిబ్బి నుండి బయటకు పోయేది. మధ్యాహ్నం పాలు గోధుమ రంగు వచ్చేంత వరకు కాగిన తర్వాత, తీసేసి చల్లార్చి తోడు పెట్టేవారు. ఈ కుండను ఉట్టిమీద పెట్టేవారు. పాలమీది మీగడకు ఒక అద్భుతమైన రుచి, పెరుగైన తర్వాత కూడా ఈ మీగడ మరొక రకమైన రుచినిస్తుంది. పాలు కాగిన తరువాత వాటినే తోడుకని వేరే కుండలో పోసినప్పుడు వేడికి అడుగంటిన పాలు గోధుమ రంగుతో కుండకు అతుక్కుపోయి ఉండేది. దాన్ని కైశిప్ప (కష్కే)తో రాకి తీసిన దాన్ని గోకు అనేవారు. కొన్ని చెంచాలు మాత్రమే వచ్చే దీన్ని చెక్కరలో కలుపుకొని పిల్లలు తినేవారు. నల్ల తుమ్మ చెట్ల పొదలలో పూసిన పసుపు పచ్చని పువ్వులు ఇంటి చుట్టూ ఉండేవి. ఎక్కడ పడితే అక్కడ పాకిన కట్లె పూవులు, గన్నేరు, మల్లె, ఆకాశ మల్లెపూలు వాటి వాసన అద్భుతంగా ఉండేది. బంతిపూలు, చామంతి, నందివర్ధన పూవులు, గునుక, తంగేడు, మందారం తదితర పూవులు బతుకమ్మ పండుగ నాడు ప్రతి ఇంట్లో చేరేవి. గునుక పూవులకు రకరకాల రంగులు వేసి వరుసలుగా పేర్చి వాటి మధ్యన తంగేడు ఇతర పూవుల వరుసలతో గుండ్రంగా బతుకమ్మను పేర్చేవారు. ఊరిలో ఎవరి బతుకమ్మ పెద్దది అనే చర్చ కొన్ని రోజులు నడిచేది. సద్దుల బతుకమ్మనాడు ఊరి చెరువులో బతుకమ్మలను విడిచేవారు. ఈ పండుగనాడు మహిళలు దాదాపు అన్ని కులాలవారు కలిసిమెలిసి గుండ్రంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడడం చరిత్రాత్మకం. చివరగా అందరూ తెచ్చుకున్న పిండివంటల పంపకాలు ఆహ్లాదకరంగా ఉండేది. ఈ పండుగలు తెలంగాణా వారు ఎక్కువ ఉన్న ఇతర రాష్ట్రాలు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో కూడా జరుగుతుండేవి. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సందర్భంగా దీని ప్రచారం ఎక్కువై ప్రపంచంలోని చాలా దేశాల్లో బతుకమ్మ ఆటలు మహిళలు ఆడి%-%పాడి ప్రత్యేక తెలంగాణా ఆకాంక్షను తెలియజేశారు. నేలరాలిన మోదుగు పూవులను ఏరుకొని రంగులను తయారు చేసుకునేవారం. ఇప్ప పూవులను ఏరుకునేవారం. కొన్నిసార్లు వేకువజామున గ్రామ ప్రజలు, మహిళలు ఇప్ప పూవులను ఏరుకునే సందర్భంలో ఎలుగుబంట్ల దాడులకు గురయ్యేవారు. మల్లెపూలల్లో బొడ్డుమల్లె, సన్నజాజి మల్లె ఇంకా రకరకాల మల్లె పూలను పిచ్చిగా ప్రేమించేవాడిని. వాటిని నా జేబులో వేసుకోవడం రాత్రి మంచంలో పరచుకోవడం, పడుకొని ఆకాశంలో నక్షత్రాలను, మేఘాలను, చంద్రుని చూస్తూ నిద్రలోకి జారుకోవడం దినచర్యగా ఉండేది. మా బాపు (నాన్న) తోట్లోకి పోయేటప్పుడు చేతిలో కర్రా, రూమి టోపీ పెట్టుకునేవాడు. ఇంటికి వచ్చిన తరువాత టోపీ తీస్తే అందులో దాచిన ఎన్నో మల్లెలు కిందపడితే వాటిని ఏరుకునేవారం, నవ్వుకునేవారం, మా నాన్నగారు కూడా సంతోషంగా ఉండడం అప్పుడే చూసేది. మా నాన్నగారితో కలిసి ఉండే క్షణాలు అసలు జ్ఞాపకమే లేవు. ఎప్పుడూ దూరంగానే ఉండేది. పూజ చేసుకుంటున్నప్పుడు మాత్రం మేము ముందర కూర్చుండేవారం. వారు కళ్ళు మూసుకొని జపం చేస్తున్నప్పుడు మేము కళ్ళు తెరుచుకొని కొబ్బరి ముక్కలు చెక్కర కలిపిన పలహారం వైపు చూస్తుండేవారం. మాకు పలహారం పెట్టిన తరువాత పరుగు తీసేవారం. నాకు ఒక చిత్రమైన ఆలోచన ఉండేది. మా నాన్న ఎప్పుడైనా పనిమీద ఏదైనా ఊరికి పోతారా అని ఎదురుచూసేవారం. ఆనాడే మాకు ఆడినంత ఆట, పాడినంత పాట.

# సెల్లు పాయే..సొమ్ము పాయే.. యూపీఐతో బ్యాంకు ఖాతాలు ఖాళీ..

**హైదరాబాద్,డిసెంబర్ 29 (సూర్యరేఖ)** కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన ప్రయివేటు ఉద్యోగి సిటీ బస్సులో కార్యాలయానికి వెళ్తుండగా.. మార్గమధ్యలో సెల్‌ఫోన్ చోరీకి గురైంది. సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు బయల్దేరాడు. పక్కనే ఉన్న మిత్రుడి ఫోన్ తీసుకొని బ్యాంకు ఖాతాను నిలిపివేసేందుకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేశాడు.అప్పటికే అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్షన్నర విత్‌డ్రా చేసినట్టు చెప్పగానే ఉలికిపాటుకు గురయ్యారు. ముచ్చటపడి..అప్పు చేసి కొనుక్కున్న ఖరీదైన సెల్‌ఫోన్ చోరీకి గురైతే పోతే పోయింది. మరొకటి కొనుక్కోవచ్చు అనుకొనేలోగా బాధితులకు ఊహించని షాక్ తగులుతోంది.బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడమే ఇందుకు కారణం.ఫోన్లలోని యూపీఐ యాప్‌ల నుంచి సొమ్ము కొట్టేస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఎంజీబీఎస్ రైతుబజార్, వారాంతపు సంతలు జరిగే సమయాల్లో తెర వెనుక నుంచి పాతనేరస్తులు మైనర్లతో చోరీలు చేయిస్తు న్నారు.ఫోన్ చేతికి అందగానే యూపీఐలో నగదును చేజిక్కించుకునేందుకు అనువైన మార్గాలను ఉపయోగించు కుంటున్నారు.మరో నంబర్ నుంచి ఫోన్ చేయగానే తమ వద్ద భద్రంగా ఉందని చెబుతారు.ఇది నిజమని భావించిన బాధితులు సిమ్‌కార్డు బ్లాక్ చేయకపోవటాన్ని అవకాశం చేసుకొని యూపీఐల్లోని సొమ్మంతా ఊడ్చిపారేస్తారు.




**ఆదుకోమంటారు..కమీషన్ ఇస్తారు..**

కొట్టేసిన సెల్‌ఫోన్లను సొమ్ము చేసుకునేందుకు మొబైల్ దుకాణాల మెకానిక్‌లకు కమీషన్ ఆశచూపి ఫోన్లను అన్‌లాక్ చేయిస్తున్నారు.ఫోన్ తమ ఆధీనంలోకి రాగానే కొట్టేసిన నంబర్ తెలుసుకుంటారు.అధికశాతం ఫోన్ వినియోగదారులు యూపీఐ ఖాతాల పాస్‌వర్డ్, పిన్ నంబర్లుగా ఫోన్ నెంబర్లలోని మొదటి, చివరి అంకెలను ఉపయోగించటం కేటుగాళ్లకు కలిసొస్తుంది. యూపీఐ, బ్యాంకు యాప్‌ల్లోకి చేరి నగదు నిల్వలు పరిశీలిస్తారు. సిమ్‌కార్డు బ్లాక్ చేయకపోవటంతో తామే ఖాతాదారులుగా పేర్కొంటూ యూపీఐ,బ్యాంకు కస్టమర్ పాస్‌వర్డ్‌లన్నీ మార్చేస్తారు. బ్యాంకు ఏటీఎం కేంద్రాలు, చిరువ్యాపారులు, హొటళ్లు,పెట్రోల్‌బంక్‌లు వద్దకు చేరి నాటకాన్ని రక్తికట్టిస్తారు.తమ కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రిలో చేర్పించామని అత్యవసరంగా డబ్బు కావాలంటూ యూపీఐ నుంచి బదిలీ చేస్తామని ఏటీఎం నుంచి తీసిస్తే చాలంటూ ప్రాధేయపడతారు.

**సార్..మా ఫోన్ దొరికిందా..**


ఫోన్లు కనిపించట్లేదని..చోరీకి గురైనట్టు పోలీసులను ఆశ్రయించేవారలో విద్యార్థుల నుంచి..సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులూ ఉంటున్నారు. యూపీఐ,బ్యాంకు యాప్‌ల్లో నుంచి నగదు మాయమైందంటూ వస్తున్న బాధితులు పెరుగుతున్నారని పోలీసులు చెబుతున్నారు. ప్రయాణ సమయంలో నిర్లక్ష్యం,దృష్టిమరల్చి చోరీలకు పాల్పడే ముఠాలు వీటిని తేలికగా కొట్టేస్తున్నారని నగరానికి చెందిన ఒక ఏసీపీ విశ్లేషించారు.గ్రేటర్ మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో ప్రతి నెలా 500-600 వరకూ సెల్‌ఫోన్లు మాయమవుతున్నాయంటూ వివిధ రూపాల్లో ఫిర్యాదులు అందుతున్నాయి.కొన్నింటికి గుర్తించి అందజేస్తున్నారు. అంతరాష్ట్ర దొంగల చేతికి చేరిన వాటి ఆచూకీ తెలిసినా రికవరీ చేయటం సవాలుగా మారుతోంది. రూ.10వేల ఫోన్ కోసం..ఇద్దరు కానిస్టేబుళ్లు,రూ.4-5వేలు ఖర్చుతో పంపినా ప్రయోజనం ఉండట్లేదంటూ రాచకొండకు చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. యూపీ, బిహార్ వంటి ప్రాంతాలకు పంపితే కొన్నిసార్లు ఎదురుదాడి జరిగే అవకాశం ఉందంటూ ఆయన ఆందోళన వెలిబుచ్చారు.

**అజాగ్రత్తతోనే అధికం...**

**ఎస్.ఎస్.జావెద్,డీఎస్పీ,సికింద్రాబాద్ జీఆర్పీ**

అధికశాతం మొబైల్‌ఫోన్లు అజాగ్రత్త కారణంగానే మాయమవుతున్నాయి.ఫ్యాంట్ వెనుక,చొక్కా ముందుజేబులో ఫోన్ ఉంచుతారు.దారెంట మాట్లాడుకుంటూ ఏమరుపాటుగా ఉంటారు. ప్రయాణాల్లో కిటీకీలు,ప్రధాన ద్వారం వద్ద నిలబడినప్పుడు తేలికగా కొట్టేస్తారు.యూపీఐలో డబ్బు జాగ్రత్తగా ఉండాలంటే పాస్‌వర్డ్ పకడ్బందీగా ఉండాలి. మొబైల్ పోగానే బ్యాంకులను సంప్రదించి లావాదేవీలు నిలిపివేయాలి. మొబైల్ లోకేషన్, ఆఫ్‌గాకుండా ఉండేందుకు వచ్చిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేయాలి.ఫోన్ పోయినట్టు గుర్తించగానే యూపీఐ కస్టమర్‌కేర్ సెంటర్లకు ఫోన్ చేసి బ్లాక్ చేయాలి.పేటీఎం 01204456456, గూగుల్‌పే 18004190157,ఫోన్‌పే 08068727374 ఈ నంబర్లలో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

# నేటి విద్యార్థులం.. కాబోయే శాస్త్రవేత్తలం మేమే.







**చైతన్య స్ఫూర్తితో వ్యాసరచన,డ్రాయింట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ,విద్యార్థులు..**
**రెండవ రోజు రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో కొనసాగిన మండల స్థాయి పోటీలు..**
**సుమారు 1000 మంది విద్యార్థులు కలం,కుంచెలకు పని చెప్పారు..**

**రాజేంద్రనగర్,డిసెంబర్ 29** ఆ విద్యార్థుల్లో కాబోయే శాస్త్రవేత్తలు కనిపించారు. పర్యావరణం సమతూకంగా ఉండాలంటే వన్యప్రాణులు,పక్షుల ఉనికి పూర్తిగా కోల్పోకుండా అడవులను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనదే అన్నట్లు వారిలోని ఆలోచన సరిళికి కుంచెతో పని చెప్పారు. దేశానికి వెన్నుముక రైతు అని చెప్పకనే గుర్తు చేస్తూ మానవాళికి ఆహారం అందిస్తున్న వ్యవసాయ పట్ల అక్కడి పాఠశాల స్థాయి విద్యార్థిల్లో చైతన్యం స్ఫూరించిందని చెప్పాలి. ఈ విషయాలు ఆదివారం రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్ రాంబాగ్ లోని హైదరాబాద్ స్కాట్స్ హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన,డ్రాయింగ్ పోటీలను గమనిస్తే అవగతమైంది. మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 1000 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వాహకులు వ్యాసరచన, డ్రాయింగ్ కాంపిటేషన్ పెట్టారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు పర్యావరణంలో వస్తున్నమార్పుల వల్ల కలుగుతున్న నష్టాలు కళ్లకు కట్టినట్లు తమ చిత్ర లేఖనంతో ఉదహరించారు. వ్యవసాయం ప్రాముఖ్యత ఏమిటీ, భూమి సారవంతంగా ఉంటే ఎలాంటి లాభాలు ఉంటాయి, గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఎదుర్కొంటున్న,ఎదురవుతున్న సమస్యలను వివరిస్తూ వారు గీసిన చిత్రాలతో కూడిన నమూనలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలు,ప్లాస్టిక్ రీ సైక్లింగ్ అవశ్యతను విద్యార్థులు చిత్ర లేఖనం,వ్యాసరచనల ద్వారా వ్యక్తం చేశారు. ప్రకృతి మాత ఒడిలోని ఈ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ప్రాణి తన వంతు ప్రాత పోషిస్తుందనే నిజాన్ని వన్యప్రాణులు,పక్షుల పాత్ర సహజసిద్ధ అటవీలో ఏ విధంగా ఉంటుందో విద్యార్థులు తమ ఆలోచనలకు పదుపు పెట్టి ఆవిష్కృతం చేశారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకరాచారి,ప్రధాన కార్యదర్శి జి.శ్రవణ్ కుమార్, కోశాధికారి ఎస్ఆర్. రజినీ కాంత్,క్రీడా, సంస్కృతిక విభాగాల కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణ్, హైదరాబాద్ స్కాట్స్ స్కూల్ అధినేత జి.జగన్నాథం,వివిధ పాఠశాలల కారస్పాండెంట్లు కరుణాకర్, రాజేంద్ర ప్రసాద్, భాస్కర్, సందీప్,వాజీద్, శేషు, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

# అల్లిబిల్లి మహేందర్ కు గౌరవ డాక్టరేట్ అందజేసిన ఏషియా ఇంటర్నేషనల్ కార్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఫ్రమ్ యూఎస్ఏ

**ఉప్పల్,డిసెంబర్ 29(సూర్యరేఖ)** గత 16 సంవత్సరాలుగా హెల్త్ కేర్ సర్వీసెస్,సోషల్ సర్వీసెస్,యూత్ డెవలప్మెంట్ లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిలుకానగర్ డివిజన్ నివాసి అల్లిబిల్లి మహేందర్ కు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఫ్రమ్ యూఎస్ఏ గౌరవ డాక్టరేట్ ను సిటీ కల్చరల్ ఆడిటోరియంలో అందజేశారు.గత 16 సంవత్సరాలుగా అల్లిబిల్లి మహేందర్ పార్టీలకతీతంగా హెల్త్ కేర్ సర్వీసెస్,సోషల్ సర్వీస్ కార్యక్రమాలతో పాటు యూత్ డెవలప్మెంట్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించి అందరి ప్రశంసలు పొందారు.ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఫ్రమ్ యూఎస్ఏ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసి సత్కరించింది.ఈ సందర్భంగా అల్లిబిల్లి మహేందర్ మాట్లాడుతూ. గత 16 సంవత్సరాలుగా తాను చేస్తున్న సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సమాజ సేవ చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందలడానికి వచ్చిన గౌరవ డాక్టరేట్ అని పేర్కొన్నారు.యువత సమాజసేవ కార్యక్రమంలో భాగస్వామి కావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.




## మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ను గుర్తు చేస్కోవడం మన బాధ్యత మల్లు రవి..




**హైదరాబాద్,డిసెంబర్29 (సూర్యరేఖ)** ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు అని,మన్మోహన్ సింగ్ కు సంతాపాన్ని తెలియజేసేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటుచేయడం చాలా ముఖ్యమైన అంశం అని ఎంపీల ఫోరం అధ్యక్షుడు మల్లు రవి అన్నారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం కృషి చేసి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ ఏర్పాటు అయిన నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీలో సంతాప తీర్మానాన్ని పెట్టి ఆయన గొప్పదనాన్ని చర్చించుకోవడం ఆయన చేసిన గ్లోబలైజేషన్,ఆర్థిక సంస్కరణలు భవిష్యత్ తరాలకు తెలిసేలా అధికారికంగా చేయడం స్వాగతించాల్సిన అంశం అన్నారు.ఆర్థిక మార్గదర్శిగా, భవిష్యత్ భారత్ కోసం తన మేధ సంపత్తిని ఉపయోగించి పటిష్టమైన ఆర్థిక పునాదులు వేసిన మన్మోహన్ సింగ్ ను గుర్తు చేస్కోవడం మన బాధ్యత అన్నారు.ఆహార భద్రత చట్టం,పని హక్కు,విద్య హక్కు చట్టం,సమాచార హక్కు లాంటి అనేక విప్లవాత్మక చట్టాలు తెచ్చిన మన్మోహన్ సింగ్ నేటి తరానికి ఆదర్శనీయులు..మన్మోహన్ సింగ్ మరణంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో సంతాప దినాలు ప్రకటించడం, అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడం అభినందిచాల్సిన విషయం అన్నారు.ఇది ఒక గొప్ప మేధావికి తెలంగాణ రాష్ట్రం చేస్తున్న ఘన నివాళి అని డాక్టర్ మల్లు రవి తెలిపారు.

## కబ్జా కోరలో కంటయ్య కుంట..




**నిజాంపేట,డిసెంబర్29(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని కంటయ్య కుంట కబ్జాకు గురైతుంది.కుంటకు ఆనుకుని ఉన్న ఓ రైతు ప్రతి ఏటా దున్నుతూ 7 ఎకరాలు 14 గుంటల విస్తీర్ణం గల కుంటను ఆక్రమించడంతో ప్రస్తుతం రెండు ఎకరాలు కూడా లేని కుంటను విచ్చలవిడిగా ఆక్రమిస్తున్న ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని సమీప రైతులు ఆరోపిస్తున్నారు. తాహసిల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న కుంట అక్రమానికి గురవుతున్న అధికారులు పట్టించుకున్న పాపన పోలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ కుంటలో నీరు ద్వారా ఎంతో మంది రైతులు పంటలు పండించుకునే వారిని కుంట కబ్జా కావడంతో నీరు నిల్వ ఉండలేకపోతున్నాయని. కుంటలో నీరు నిల్వ ఉండేలా అధికారులు చొరవ చూపి కుంట ఇరువైపులా పూడికతీత పనులు చేపట్టి కబ్జాకోరలో ఉన్నటువంటి కంటయ్య కుంటను కాపాడాలని సమీప రైతులు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన ఎంపీడీవో రాజిరెడ్డి..




**నిజాంపేట,డిసెంబర్29(సూర్యరేఖ)** మండల పదిలోనే నగరం తండా గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతుంది. ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో రాజిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు వచ్చిన అధికారులకు పూర్తి వివరాలు తెలియజేయాలని అధికారులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అరిఫ్ ఉస్సేన్,కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేట్ పెరిగింది..

**డిజిపి జితేందర్**




**హైదరాబాద్,డిసెంబర్ 29(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేట్ పెరిగిందని డిజిపి జితేందర్ వెల్లడించారు. తెలంగాణలో 43.33 శాతానికి క్రైమ్ రేట్ పెరిగిందని దేశంలో మొదటిసారిగా రాష్ట్రంలో 2.42 కోట్ల నగదు సైబర్ నేరగాళ్ల నుండి తెలంగాణ పోలీసులు కాపాడారని ఆయన చెప్పారు.180 కోట్ల నగదు బాధితులకు అందజేశామని పదివేల ఐఎంఈఐ నంబర్లు బ్లాక్ చేశామని,ఈ ఏడాది డయల్ 100 కాల్స్ 16.92 వేల కాల్స్ రిసీవ్ చేసుకున్నామని, 7 నిమిషాల వ్యవధిలో ఘటన స్థలానికి పోలీసులు చేరుకోగలిగారని 2100 బ్లూ కోల్ట్స్ పోలీస్ కానిస్టేబుల్స్ ఆఫీసర్స్ తెలంగాణ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్నారని తెలంగాణ డిజిపి జితేందర్ మీడియాకు వెల్లడించారు.

# శ్రీ నాగ పోచమ్మ దేవాలయం - 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,డిసెంబర్ 29(సూర్యరేఖ)** మీర్ పెట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని హెచ్ బీ కాలనీ ఫేజ్-2 శ్రీ నాగ పోచమ్మ దేవాలయం - 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్లు అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర నగర్ ఫేజ్-2 నాగ పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు సదానందం,సెక్రటరీ వంజరి ప్రవీణ్, రాజిరెడ్డి,కమిటీ సభ్యులు,కాలనీవాసులు స్థానిక బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాజు,నిసార్ అహ్మద్ గోరి,దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ం

## వడ్డెర సంఘం వన భోజనానికి హాజరైన మాధవరం కృష్ణారావు..



**కూకట్ పల్లి,డిసెంబర్29 (సూర్యరేఖ)** కూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ పరిధిలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వన భోజన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరైనారు.అనంతరం ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ...కూకట్ పల్లి నియోజకవర్గంలో వడ్డెర సంఘానికి ఎటువంటి సమస్య వచ్చిన పరిష్కరించడానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆయన అన్నారు.వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వనభోజనానికి హాజరు కావడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు.ఈ కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్,వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు బోనాల ఉత్సవాలు..



**శివంపేట,డిసెంబర్29(సూర్యరేఖ)** శివంపేట మండలం లోని సికింద్లపూర్ గ్రామంలో గ్రామ దేవతల బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కొలువైన బంగారమ్మ,దుర్గమ్మ,మహంకాళి పోచమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించి బోనాల సమర్పించారు. తాజా మాజీ సర్పంచ్ ఏనుగు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బోనాలు ఉత్సవాల నిర్వహించగా, నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి హాజరై పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణ గౌడ్,బీఆర్ఎస్ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

# మోహన్‌బాబును ఉక్కిరి బిక్కిరి చేస్తున్న కోర్టు పోలీసులు.

**అజ్ఞాతంలో మోహన్ బాబు..**



**హైదరాబాద్,డిసెంబర్ 29(సూర్యరేఖ)** ప్రముఖ టీవీ జర్నలిస్టుపై హత్యాయత్నం కేసులో మోహన్ బాబుకు ముందస్తు బెయిల్ రాలేదు. పోలీసులు ఇచ్చిన నోటీసులపై ఆయనకు కోర్టు ఇచ్చిన రిలీఫ్ 24వ తేదీతో ముగిసిపోయింది. ముందస్తు బెయిల్ కూడా రాలేదు.ఈ వయసులో ఎక్కడ జైలుకు వెళ్తామన్న ఉద్దేశంతో ఆయన ముందు జాగ్రత్తగా ఆజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఎక్కడున్నారో కుటుంబసభ్యులకు తప్ప ఎవరికీ తెలియదు. దుబాయ్ లో ఉన్నారని కొంత మంది చెబుతున్నారు.గడువు ముగిసిన తర్వాత మరోసారి నోటీసులు జారీ చేస్తామని పోలీసు కమిషనర్ చెప్పారు.కానీ వారం అవుతున్నా నోటీసులు జారీ చేయలేదు.నోటీసులు జారీ చేస్తే అరెస్టు నుంచి తప్పించుకోవచ్చని పోలీసులు హాజరై..ఏదో విధంగా అరెస్టు చేయకుండా విచారణకు సహకరిస్తానని ఒప్పించేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది.కానీ పోలీసులు నోటీసులు జారీ చేయలేదు.ఇప్పుడు కనిపిస్తే వారు అరెస్టు చేయవచ్చు.అసలే టాలీవుడ్ విషయంలో సీఎం రేవంత్ అసహనంతో ఉన్నారని అంటున్నారు. ఇలాంటి అవకాశాలు దొరికితే పోలీసులు వదిలి పెట్టే అవకాశం ఉండదు. అందుకే మోహన్ బాబు అజ్ఞాతం నుంచి బయటకు రాలేకపోతున్నారు.తాను ఇలా దాక్కుంటున్నానన్న భావన ఆయననూ స్థిమితంగా ఉండనిచ్చే పరిస్థితి లేదు.తన వయసు చాలా ఎక్కువ అని..తనకు చాలా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని..మతి మరుపు కూడా ఉందని ఆయన కోర్టుకు చెప్పుకున్నా ప్రయోజనం లేకపోయింది. అరెస్టు చేస్తే బెయిల్ రావడానికి చాలా సమయం పడుతుంది. అందుకే మోహన్ బాబు అటు బయటకు రాలేక..ఇటు అజ్ఞాతంలో ఉండలేక ఇబ్బంది పడుతున్నారని అనుకోవచ్చు..పోలీసులు ఈ కేసు విషయంలో ఏ స్టాండ్ తీసుకుంటారన్నదానిపై మోహన్ బాబు తర్జన భర్జన పడుతున్నట్లు అర్థమవుతుంది.

## డబుల్ బెడ్ రూమ్ సముదాయాల్లో సమస్యలు పరిష్కరించాలి ఎమ్మెల్యే కృష్ణారావు...



**హైదరాబాద్,డిసెంబర్ 29(సూర్యరేఖ)** నిజాంపేట డబల్ బెడ్ రూమ్ సముదాయాల్లో నెలకొన్న సమస్యలన్నీటిని పరిష్కరించాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.డబుల్ బెడ్ రూమ్ పిల్లర్ల వద్ద వర్షపు నీరు సెల్లార్ లోకి రావడంతో పాటు తాగునీరు కరెంటు సమస్యలు ఉన్నాయని లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆయన అన్నారు.ఈ సమస్యలన్నిటిని తాను నిజాంపేట్ కమిషనర్ స్వయంగా వెళ్లి పరిశీలించానని,తాగునీరు కరెంట్ సమస్యలు ఉన్నమాట వాస్తవమేనని ఈ సమస్యల పట్ల ప్రభుత్వం దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## డిసిసిబి హైదరాబాద్ జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ..

**తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**



**ఇబ్రహింపట్నం,డిసెంబర్29(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ప్రధాన కార్యక్రమంలో హెచ్ డిసిసిబి హైదరాబాద్ జిల్లా కో- ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నూతన సంవత్సరం 2025 క్యాలెండర్,డైరీని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.రైతులకు సకాలంలో రుణాలు అందించాలి అని, బ్యాంక్ వ్యవస్థ రుణాలపై అవగాహనా పెంచాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో టీజీకాబ్ చైర్మన్ మార్నెని రవీందర్ రావు,వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య,ఎండి గోపి,సీజీమ్ జ్యోతి, డీసీసీబీ చైర్మన్లు భోజరెడ్డి,దేవేందర్ రెడ్డి,నాగేశ్వర్ రావు, విషువర్ధన్ రెడ్డి,కుంట రెమెషరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, బ్యాంక్ డైరెక్టర్లు చెంద్రశేఖర్,మిగులయ్య,ఆనంద్,బాల్ రెడ్డి,బ్యాంక్ సీఈఓ భాస్కర్ సుబ్రహ్మణ్యం,జిఏంలు ప్రభాకర్ రెడ్డి, ఫణి కుమార్,బ్యాంక్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మాసిటీ రద్దుకు మరో పోరాటం

**కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి..**
**కురిమిద్దలో రైతులు,బాధితులు,ఫార్మా వ్యతిరేక పోరాట సమితి నాయకులు ర్యాలీ..**
**ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త కావుల సరస్వతి..**



**యాచారం,డిసెంబర్29(సూర్యరేఖ)**ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యాచారం మండల పరిధిలోని కురిమిద్దలో రైతులు,బాధితులు,ఫార్మా వ్యతిరేక పోరాట సమితి నాయకులు ర్యాలీ నిర్వహించారు.ఫార్మాసిటీ వస్తే ఇక్కడి ప్రాంతాల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో గ్రామస్థులు వివరించారు. అధికారంలోకి వస్తే ఫార్మాను రద్దు చేస్తామని,కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త సరస్వతి మండిపడ్డారు.ఫార్మా వస్తే ఎటువంటి ప్రమాదాలు వస్తాయో గ్రామాల్లో ర్యాలీ చేస్తూ ప్రజలకి తెలియచేసారు. ఫార్మా కంపెనీలు పక్కన ఉన్న చోట చుట్టు ప్రక్కన అన్ని గ్రామాలు నాశనం అయ్యాయని, పాడి పంటలు పండక, చెరువుల్లో నీరు కలుషితం అయి పశువులు,చేపలు చనిపోయి, గాలి కాలుష్యం వల్ల ఊపిరి ఆడని పరిస్థితి ఉందని తెలియచేసారు. కాలుష్యం వల్ల మహిళలకి గర్భ శ్రవాలు అవుతున్నాయి.రాబోయే తరాల పుట్టే పిల్లలు అంకవైకల్యంతో పుడుతున్నారు.కాబట్టి భూమి ఇచ్చిన వారు,ఇయ్యని వారు,ఇతర వృత్తుల వారు అందరు కూడా కలిసి ఈ ఫార్మా సిటీ రద్దు చేసే వరకు పోరాటం చెయ్యాలని పిలుపు నీచ్చారు. ఫార్మా సిటీ రద్దు చేస్తాం,భూసేకరణ రద్దు చేస్తాం అని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఫార్మా గో బ్యాక్ అంటూ, పాటలు పాడుతూ ప్రజలని చైతన్య పరిచారు.గ్రామంలో ముఖ్యంగా మహిళలు స్పందిస్తూ ఈ ఫార్మా సిటీ ఎట్టి పరిస్థితిలో రానియ్యకూడదని,వస్తే మన పిల్లల భవిష్యత్తు అంధకారమే అని ఖచ్చితంగా ఫార్మ రాకుండా చెయ్యాలన్నారు ఈ కార్యక్రమంలో పంగ వినోద్ రెడ్డి, కూనరెడ్డి అచ్చిరెడ్డి,ముత్యాల మహిపాల్ రెడ్డి, దేవోజీ,కల్లు కొండల్ రెడ్డి,పాండురంగాచారి,బైకని పాండు,పంగ అనసూయ,పంగ మణెమ్మ,దారా రవి, పాలేమోని రాజు,పంగ చిన్న అంజిరెడ్డి ఆరెపల్లి లింగం,ముత్యాల సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి మిత్రమండలి క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎంపీఆర్..



**ఉప్పల్,డిసెంబర్ 29(సూర్యరేఖ)** వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఆదివారం జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి హాజరై క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వాసవి మిత్రమండలి అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా,రెబెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిని తిరుమలేష్ గుప్తా,కోశాధికారి,గంప కృష్ణ గుప్తా,కార్య నిర్వాహక కార్యదర్శి,పెద్ది శ్రీనివాస్ గుప్తా,తరకేశ్వర్, గజ్జెల రమేష్,తాటి శ్రీనివాస్,ఉప్పల శ్రీనివాస్, ఉప్పల ఆంజనేయులు,మిర్యాల అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యులను సన్మానించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.ఏ.జలీల్ పాషా



**ఉప్పల్,డిసెంబర్ 29(సూర్యరేఖ)** హబ్సిగూడలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ నూతన ధర్మకర్తల మండలి సభ్యులుగా ఎన్నికైన బిక్కుమళ్ల అంజయ్య గుప్తా,ఈగ అంగనేయులు,తుమ్మల దేవిరెడ్డి,గడ్డం లక్ష్మరెడ్డి,అమరేశ్వరి,గరిక రాజేశ్వరి, భూసం రఘునాథ్ రెడ్డి,మధన్ గౌడ్,ఎడ్ల అంజయ్య,ధర్మేందర్ నాయక్,రాఘవేందర్ లను ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎంఏ.జలీల్ పాషా ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. దేవాదాయశాఖ వెంకన్న,అర్చకులు రవి,సంతోష్ లను జలీల్ పాషా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆలయ అభివృద్ధి కోసం నూతన కమిటీ సభ్యులు హార్నిశలు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జంగారెడ్డి,సాయి,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల గొంతుక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసిన మెదక్ జిల్లా బీసీ నాయకులు,ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్



**శివంపేట్,డిసెంబర్ 29 (సూర్యరేఖ)** మెదక్ జిల్లా శివంపేట మండలం పి గ్రామానికి చెందిన బీసీ నాయకులు,ప్రముఖ సంఘ సేవకులు సేవా రత్న అవార్డు గ్రహీత బండారి గంగాధర్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి సన్మానించారు.అలాగే మెదక్ జిల్లా అవగాహనపై సదస్సు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి మనకెంతో మనకంత నినాదంపై బీసీల వాటకై మేమెంతో మాకంత నినాదంపై చర్చించడం జరిగింది.నిరంతరం శ్రమిస్తున్నటువంటి బీసీ నాయకులు ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్,హిందూ బిసి మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ ఆజాద్,ఉద్యమ నాయకుడు నల్గొండ జిల్లా వట్టి జానన్న,మెదక్ జిల్లా నాయిని బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మంగలి స్వామి,కౌడిపల్లి మండల అధ్యక్షులు కృష్ణ,కొల్చారం మండల అధ్యక్షులు,చిలిపిచ్చే మండల అధ్యక్షులు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి చర్చించడం జరిగింది.

# హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య.?





**ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమా!**

**కొల్చారం,డిసెంబర్29(సూర్యరేఖ)** మెదక్ జిల్లా కొల్చారం పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సాయి కుమార్ శనివారం రాత్రి స్టేషన్ ముందున్న ఎస్సై క్వార్టర్ లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.1992 బ్యాచ్ కు చెందిన హెచ్ సి1140 సాయికుమార్ రెండు సంవత్సరాల క్రితం జరిగిన బదిలీలలో కొల్చారం పోలీస్ స్టేషన్ కు హెడ్ కానిస్టేబుల్ గా వచ్చాడు. గుంటూరు జిల్లాకు చెందిన సాయి కుమార్ కు సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన లక్ష్మితో వివాహం జరగడంతో జిల్లాలోని నర్సాపూర్ ప్రాంతంలో సుదీర్ఘ కాలం పనిచేయడంతో నర్సాపూర్ పట్టణంలో ఇల్లు నిర్మించుకొని గత కొన్ని సంవత్సరాలుగా నర్సాపూర్ లో నివసిస్తున్నాడు. నర్సాపూర్ పట్టణానికి చెందిన దివ్య టిఫిన్ సెంటర్ దివ్య అనే మహిళతో వివాహేతర సంబంధం హెడ్ కానిస్టేబుల్ సాయి కుమార్ కు ఉంది.గత కొన్ని రోజులుగా సాయికుమార్ వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ భర్త సాయికుమార్ ను డబ్బుల కోసం వేధింపులకు గురి చేస్తు,డబ్బులు ఇవ్వకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరింపులకు గురి చేస్తుండడంతో ఆందోళనకు గురైయ్యాడు.గత కొన్ని రోజులుగా తన చావే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతదని అంటూ, ఆత్మహత్య చేసుకుంటా అంటూ ఇంట్లో చెప్పాడని కుటుంబీకులు పోలీసులకు,కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కి సమాచారం ఇచ్చారు.దీంతో ఎస్ఐ గౌస్ సాయి కుమార్ తో రెండు రోజుల క్రితం మాట్లాడారు.రెండు రోజుల్లో తానే సమస్యను పరిష్కరించు కుంటానని తెలపడంతో ఈ విషయం ఎస్సై హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు తెలిపారు.శనివారం రాత్రి విధులకు వచ్చిన సాయి కుమార్ అందరూ నిద్రించిన సమయంలో స్టేషన్ ముందున్న పాడుబడిన ఎస్సై క్వార్టర్ వెనుక భాగంలోనున్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సంఘటన స్థలంను మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ సందర్శించారు.వెంటనే కొల్చారం పోలీసులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# రాజేంద్రనగర్ మన్నాఫుల్ గాస్పెల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు







**రాజేంద్రనగర్,డిసెంబర్ 29** క్రైస్తవ జీవితంలో కష్టాలు వస్తాయని,వాటిని తట్టుకుని ముందుకు సాగాలని మన్నా ఫుల్ గాస్పెల్ చర్చికి చెందిన బ్రదర్ పాల జోబ్ అన్నారు. చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ ఆద్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ ప్రార్ధనలను పురుషుల సహవాసం ఆధ్వర్యంలో నడిపించారు. ఆరాధనలకు బ్రదర్ ఎ. డానియేల్ అధ్యక్షత వహించగా, బ్రదర్ డి.సాయిలు ఆరాధన నడిపించారు.బ్రదర్ సీహెచ్ జాన్ కీర్తనలు చదివి వినిపించారు.బ్రదర్ ఇ.నానీ సాక్ష్యము చెప్పి దేవుని మహిమ పరిచారు.బ్రదర్ డానీ అవసరతల కోసం ప్రార్ధనలు చేశారు. ప్రత్యేక ప్రార్ధనలలో వాఖ్య పరిచర్య చేసిన బ్రదర్ పాల జోబ్ మాట్లాడుతూ... దేవుని రాజ్యంను పొందుకోవాలంటే అనేక కష్టాలు, శ్రమలు అనుభవించాల్సి ఉంటుందన్నారు. లోకంలో జీవిస్తున్న క్రైస్తవులు మంచి సాక్ష్యం కలిగి ఉండాలన్నారు. సహనం, ఓపిక చాలా అవసరం అన్నారు. అప్పుడే దేవుని స్వాస్థ్యమును పొందుకుంటామన్నారు. ఆదివారం నుంచి జనవరి 1వ తేదీ వరకు ప్రత్యేక ప్రార్ధనలు: రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్..ఆది,సోమవారాలలో సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు ఉంటాయని చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ తెలిపారు.ఈ నెల 31న రాత్రి 8:30 గంటల నుంచి వాచ్ నైట్ సర్వీస్ ఉంటుందన్నారు.నూతన సంవత్సరాన్ని ఎదుర్కోవడానికి ప్రార్ధనలతో సిద్ధం కావాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రార్ధనలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.2025 జనవరి 1వ తేదీన ఉదయం 11గంటలకు నూతన సంవత్సర ఆరాధన ఉంటుందన్నారు.ప్రతి క్రైస్తవుడు హాజరై యేసయ్య ఆశీర్వాదాలు పొందుకోవాలన్నారు.

# మేరు కులస్తులకు ప్రభుత్వ పరంగా అన్ని అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తాం

**మేరు కులస్తులు రూపొందించిన క్యాలెండర్ ను ఆవిష్కరించిన**
**కాంగ్రెస్ నేతలు పరమేశ్వర్ రెడ్డి,వెంకటేష్,మేరు సంఘం అధ్యక్షులు వెన్ను రమేష్**



**ఉప్పల్,డిసెంబర్29(సూర్యరేఖ)**మేరు కులస్తులకు ప్రభుత్వ పరంగా అన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుల పరమేశ్వర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మేరు సంఘం రాష్ట్ర నాయకులు కె.వెంకటేష్ లు పేర్కొన్నారు. తెలంగాణ మేరు సంఘం చిలుకానగర్ డినిజన్ అద్యక్షులు వెన్ను రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆది వారం మందుల పరమేశ్వర్ రెడ్డి,కె.వెంకటేష్‌లు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి,వెంకటేష్ లు మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కుల సంఘా లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే దేశానికే ఆదర్శమని అన్నారు. మేరు కులస్తులకు పింఛన్లు మంజూరు చేయాలని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లలో మేరు కులస్తులను ప్రాదాన్యత కల్పించాలని కోరారు.ఈకార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అద్యక్షులు రామగిరి గిరి,ఉపాధ్యక్షులు తాళ్ళ శ్రీధర్,మేరు సంఘం ఉప్పల్ జోన్ అద్యక్షులు కొత్తపల్లి రమేష్,మేరు సంఘం చిలుకానగర్ నాయకులు నందగిరి రాజు,వెన్ను రామకృష్ణ,వొడపల్లి ఉపేందర్, రామగిరి అశో ఓక్,రాపర్తి వేణు, అదిమూలం కరుణాకర్, రాయబ రాబు వేణు గోపాల్, ఎస్.మధు,ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో గడ్డివాము దగ్ధం..



**శివంపేట,డిసెంబర్ 29 (సూర్యరేఖ)** శివంపేట మండలం లింగోజిగూడ తండాలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన మాలోత్ లాల్ సింగ్ అనే వ్యక్తికి చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు నిప్పుఅంటుకొని మంటలు చేలరేగాయి.విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఫైర్ సిబ్బంది ఐలయ్య,రమేష్,ప్రశాంత్, యాదగిరి, నాగరాజు, రమేష్ చేరుకొని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.అగ్నిప్రమాదంలో పశుగ్రాస మొత్తం దగ్ధం అయినట్లు బాధితులు తెలిపారు.

## జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ కు దరఖాస్తుల ఆహ్వానం..

**హైదరాబాద్,డిసెంబర్29** రంగారెడ్డి,సికింద్రబాద్,హైదరాబాద్ ట్రయల్ కోర్టులలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సెల్ న్యాయవాదల నియామకం కోసం ఆసక్తి,అర్హత కల్గిన న్యాయవాదుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జీహెచ్ఎంసీ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.వివిధ ట్రయల్ కోర్టులలో మొత్తం 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయని,అందులో రంగారెడ్డి జిల్లా ట్రయల్ కోర్టులో 8 పోస్టులున్నట్లు జీహెచ్ఎంసీ వెల్లడించింది.పటాన్ చెరువు, రామచంద్రపురం ట్రయల్ కోర్టుల్లో 1 పోస్టు, సికింద్రబాద్ హైదరాబాద్ ట్రయల్ కోర్టులో 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. సంబంధిత జిల్లాల బార్ అసోసియేషన్ లో 10 సంవత్సరాలు,సీనియర్ సివిల్ కోర్టులో 7 సంవత్సరాలు,జూనియర్ సివిల్ కోర్టులో 5 సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలని జీహెచ్ఎంసీ సూచించింది.అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తును పూర్తిచేసి 2025 జనవరి 23వ తేదీలోగా కార్యాలయ పని వేళలో జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లోని లీగల్ సెల్ సెక్షన్ లో సమర్పించాలని జీహెచ్ఎంసీ తెలిపింది.

## కొల్చారం హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్ ఆత్మహత్య..

**ఆత్మహత్యకు గల కారణాలు.?**





**కొల్చారం,డిసెంబర్ 29(సూర్యరేఖ)** మండల కేంద్రమైన కొల్చారం పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్(52) ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో పాత ఎస్ఐ క్వార్టర్స్ ముందు చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సాయికుమార్ కు పిఎస్ లో రాత్రి షిఫ్ట్ డ్యూటీ ఉండగా అది పూర్తి చేసుకుని ఉదయం యధావిధిగా వాకింగ్ పూర్తిచేసుకునే స్థానిక బస్టాండ్ వద్ద ఓ హోటల్లో టిఫిన్ చేసి,చాయ్ తాగి తిరిగి పోలీస్ స్టేషన్ కు వచ్చాడని స్థానికులు తెలిపారు.కాగా ఈ లోపే తాను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లుగా తన కూతురికి సమాచారం ఇచ్చి,ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో మృతిచెందినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ రాజశేఖర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని సాయికుమార్ మృతదేహానికి పంచనామా నిర్వహించి,పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.కాగా మృతుడు సాయికుమార్ ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లాకు చెందిన వాడు కాగా 1992 బ్యాచ్ లో కానిస్టేబుల్ గా ఉద్యోగం పొంది వృత్తిరీత్యా మెదక్ జిల్లా నరసాపూర్ పట్టణంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. సుమారు ఆరు సంవత్సరాల నుండి హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ, నర్సాపూర్ కౌడిపల్లి ఠాణాలలో పనిచేసి బదిలీపై సుమారు 20 నెలల క్రితం కొల్చారం పోలీస్ స్టేషన్ కు వచ్చారు.సాయికుమార్కు భార్య,వివాహం అయిన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.ఇదిలా ఉండగా పోలీసుల కథనం ప్రకారం సాయికుమార్ ఆత్మహత్యకు గల కారణాలు ఇలా ఉన్నాయి...నర్సాపూర్ పట్టణంలో టిఫిన్ సెంటర్ నడుపుకుంటున్న దివ్య అనే మహిళతో కానిస్టేబుల్ సాయికుమార్ కు పరిచయం ఏర్పడింది.సాయికుమార్ పలుమార్లు ఆమెతో ఫోన్లో సంభాషించడానికి గమనించిన సదరు మహిళ భర్త శివకుమార్,అల్లుడు కిరణ్ తో కలిసి కానిస్టేబుల్ సాయికుమార్ ను భారీ మొత్తంలో డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించి, ఇవ్వకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, చంపేస్తామంటూ బెదిరించారు.దీంతో విషయం బయటకు తెలిస్తే ఎక్కడ పరువు పోతుందోనని మనస్థాపానికి గురై సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు సాయికుమార్ భార్య కాటూరి శైలజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్





**ఉప్పల్,డిసెంబర్ 29(సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్లోని బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం 2025 కాలమానాన్ని కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆవిష్కరించారు. అనంతరం కార్పోరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ. ఎమ్మెల్యే ఎలక్షన్లో బీరప్ప గడ్డ కుమ్మరి సంఘం సభ్యులు ఇచ్చిన మాట ప్రకారంగా వారి పూర్తి మద్దతు తెలుపుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భారీ మెజారిటీతో గెలుపుకు సహకరించారని పేర్కొన్నారు.అదేవిధంగా వారి అభ్యర్థన మేరకు బీరప్పగడ్డలోని కుమ్మరి సంఘం స్థలంలో నూతన భవనం ఏర్పాటు చేయాలన్న వారి అభ్యర్థనను వీలైనంత త్వరలో వారికి భవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కౌకొండా జగన్,బింగి శ్రీనివాస్, మార్కా శీను,శ్యామ్ బీరప్పగడ్డ కుమ్మరి సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి భానుచందర్ , కోశాధికారి కుమార్ వారి సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వసతి గృహంలో బాలిక నగ్న పూజలు

**కరీంనగర్ :** పిల్లలకు చదువులు చెప్పాల్సిన విద్యాలయాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇంతకాలం మందుబాబులు మాత్రమే పాఠశాలలు, కళాశాలల ఆవరణలో మద్యం సేవించేవారు. కానీ, ఇప్పుడు అందరూ ఉండగానే క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారు.తెలంగాణ గురుకుల పాఠశాలలకు ప్రసిద్ధి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. రాష్ట్రంలో 2 వేలకుపైగా గురుకులాలు ఏర్పాటు చేసింది. విద్యార్థులకు మంచి విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందిస్తోంది. దీంతో ఏటా గురుకుల పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. గురుకుల ప్రవేశ పరీక్షకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. అయితే గురుకుల పాఠశాల్లో కన్ని రోజులుగా దారుణాలు జరుగుతున్నాయి. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన పాఠశాలలో ఓ విద్యార్థిని మృతిచెందింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా గురుకులాల్లో ఆహారం సరిగా ఉండడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. మెస్ జార్జీలు పెంచిన తర్వాత కూడా నాణ్యమైన భోజనం పెట్టడం లేదు. రోజుకో గురుకులంలో విద్యార్థులు నిరసన తెలుపుతున్నారు. ఇలాంటి తరుణంలో ఓ గురుకులంలో ఏకంగా క్షుద్ర పూజలు చేయడం కలకలం రేపింది. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో గురుకుల పాఠశాలలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. విద్యార్థులకు మాయమాటలు చెప్పి వారితోనే పూజలు చేయించడం సంచలనం రేపుతోంది.మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేవి విద్యాలయాలే. మూఢనమ్మకాలను చిన్నారుల మనసుల్లో నుంచి తొలగించాల్సిన బాధ్యత గురువులది. కానీ, అలాంటి గురువులు ఉండే విద్యాలయంలోనే క్షుద్ర పూజలు చేయడం ఇప్పుడు సంచలనం రేపుతోంది. వర్షాలు కురవని సమయంలో కప్పల పెళ్లి చేస్తే వర్షాలు కురుస్తాయని రైతుల నమ్ముతారు. అది ఒక నమ్మకం. కానీ, నగ్నంగా పూజలు చేస్తే




కాసులు కురస్తాయి అని ఇప్పటికీ కొందరు నమ్ముతున్నారు. ఇదే విషయాన్ని మంథనిలోని గురుకుల విద్యార్థినికి చెప్పారు. నమ్మించారు ఇద్దరు వ్యక్తులు. పూజలు చేస్తున్న సమయంలో భయం వేయడంతో బాలిక పారిపోయి విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.మంథని పట్టణంలోని ఓ హాస్టల్ పనిచేసే మహిళా వంటమనిషి.. ఓ బాలికకు క్షుద్రపూజల గురించి తెలిపింది. నగ్నంగా పూజలు చేస్తే డబ్బులు బాగా వస్తాయని నమ్మించింది. డబ్బులు కూడా ఇస్తామని చెప్పడంతో వంట మనిషి మాటలు నమ్మిన బాలిక క్షుద్రపూజలకు సరే అని చెప్పింది. దీంతో వంటమనిషి ఈ తతంగానికి తెరలేపింది. నగ్న పూజలు చేస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుందని వారం క్రితం హాస్టర్ వర్కర్ కొందరు పూజలు చేసేవారిని సంప్రదించింది. దీంతో ఆందోళన చెందిన బాలిక హాస్టల్ నుంచి తప్పించుకుంది. బంధువుల ఇంటికి వెళ్లింది. వారం రోజులు అక్కడే ఉండిపోయింది. తల్లిదండ్రులు రావడంతో వారికి విషయం చెప్పింది. దీంతో బాలిక బంధవులు, తల్లిదండ్రులు హాస్టల్‌కు చేరుకుని వంటమనిషితో వాగ్వాదానికి దిగారు.హాస్టల్ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు సమాచారం అందుకున్న మంథని పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. చదువుకునే ఆడపిల్లలతో ఇలాంటి పనులు చేయించడంతో విషయం తెలుసుకున్న పోలీసులు వంట మనిషిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల డేటా ఎంట్రీ సమస్యకు పరిష్కారం

**కరీంనగర్ :** అవసరం మన ఆలోచనలకు పదును పెడుతుంది. ఆవిష్కరణలవైపు అడుగులు వేయిస్తుంది. సమస్యలకు పరిష్కార మార్గం వెతుకుతుంది. ప్రపంచంలో చాలా వరకు ఇలా ఆవిష్కృతమైనవే. ఆవిష్కరించాలి అంటే.. అందుకు సైంటిస్టే కానవసరం లేదు. అవసరం మన ఆలోచనలకు పదును పెడుతుంది. సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా ఆలోచింప జేస్తుంది. ఈ క్రమంలో ఆవిష్కరణలవైపు అడుగులు వేయిస్తుంది. సృష్టిలో కొన్ని సహజ సిద్ధంగా పరిష్కార మార్గాలు చూపితే.. చాలా సమస్యలకు మనిషే పరిష్కారం కనుగొన్నాడు. అందుకే ఆది మానవుల కాలం నుంచి ఆధునిక మానవుడిగా ఎదగగలిగాడు. ఇక నేటి తరం యువత సమస్యల పరిష్కారానికి అనేక మార్గాలు కనిపెడుతోంది. పిల్లలు కూడా తమ మెదడుకు పదును పెట్టి ఆవిష్కరణలు చేస్తున్నారు. చదువుకున్న జ్ఞానంతో కొత్త కొత్త ఆవిష్కరణలతో ప్రతిభ కనబరుస్తున్నారు. రెండేళ్ల క్రితం వేములవాడకు చెందిన బాలుడు ధాన్యం బస్తాల్లోకి ఎత్తే చిన్న పరికరం తయారు చేశాడు. దీంతో తన తండ్రి సమస్యకు పరిష్కారం కొనుగొన్నాడు.ఇక ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడ పని తప్పించుకుందామని చూస్తారు. కరెంటు పోయినా, ఇంటర్నెట్ అవాంతరాలు ఏర్పడినా ఖాళీగా ఉంటారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నా మేం ఏం చేయాలని ఎదురు ప్రశ్నిస్తారు. అయితే అందరూ అలాగే ఉండాటారని కాదు. కొంత మంది తీరుతో అందరూ అపవాదు ఎదుర్కొంటున్నారు. అయితే తెలంగాణలో ఓ పంచాయతీ కార్యదర్శి మాత్రం సాకులు చెప్పి





తప్పించుకోకుండా సమస్యకు పరిష్కారం కనుగొని విధులు సక్రమంగా నిర్వహిస్తున్నాడు.మంథని మండలం ఉప్పట్ల పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్నారు. గ్రామంలో సెలఫోన్ సిగ్నల్ సక్రమంగా ఉండడం లేదు. దీంతో తరచూ అవాంతరాలు కలుగుతున్నాయి. సర్వే ఆలస్యం అవుతోంది. దీంతో ఆయనకు వినూత్న ఆలోచన చేశాడు. ఎత్తయిన ప్రాంతంలో ఉంటే సిగ్నల్ సమస్య ఉండడం లేదని గుర్తించాడు. దీంతో తన సెల్‌ఫోన్‌ను కర్రకు కట్టి.. ఎత్తుగా ఉంచుతున్నాడు. దాని వైఫై ఆన్‌చేసి.. మరో సెల్‌ఫోన్‌లో ఇందిరమ్మ యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నాడు. దీంతో సర్వే పని చకచకా జరుగుతోంది. గ్రామంలో సర్వేకు 390 దరఖాస్తులు రాగా, పది రోజుల్లో 230 దరఖాస్తులు సర్వే చేశారు. మరో 170 ఇళ్ల సర్వే చేయాల్సి ఉందని కార్యదర్శి తెలిపారు.=

# వేములవాడలో అడగడుగునా నిఘా వైఫల్యం

**కరీంనగర్ :** వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. మొన్న రాజన్న కోడలు అక్రమంగా విక్రయానికి గురైన ఘటన మరిచిపోక ముందే ఆలయంలోని హుండీలో నగదు మాయం కలకలం సృష్టిస్తుంది. మరోవైపు మాంసాహారం ఆలయ ఆవరణలో పంపిణీ విమర్శలకు తావిస్తుంది.దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ లో వరుస ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్యలు సాగుతుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తుంది. నిత్యం వేలాది మంది భక్తులు సందర్శించే రాజన్న ఆలయంలో అధికారుల నిర్లక్ష్యం, నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.గర్భాలయంలోని హుండీల నుంచి నగదు చోరీ అధికారుల నిర్లక్ష్యానికి, నిఘా వైఫల్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. వారంలో మూడు సార్లు హుండీల నుంచి మైనర్లు డబ్బులు తీసుకుపోతుంటే నిఘా కెమెరాలు, భద్రతా సిబ్బంది, హడావిడి చేసే ఆలయ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొక్కుబడి చర్యలతో చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తి భావంతో భక్తులు సమర్పించే కానుకలు చోరీకి గురికావడం, కోడెలు అక్రమంగా విక్రయించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.ప్రస్తుతం హుండీలో నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరు మైనర్లను పోలీసులు గుర్తించారు. అరెస్టు చేసి జువెనైల్ కు తరలించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గతంలో పలువురు హుండీలలోని నగదు కాజేసి కటకటాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఓవైపు కోడెల గోల నడుస్తుంటే, ప్రస్తుతం హుండీలోని నగదు మైనర్లు ఎత్తుకెళ్లడం అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుంది.మరోవైపు ఆలయ ఆవరణలో మాంసాహారం పంపిణీ వివాదాస్పదంగా మారింది. క్రిస్మస్




రోజున ఆలయ ఆవరణలో చికెన్ రైస్ ఎగ్ రైస్ గుర్తుతెలియని వ్యక్తులు పంపిణీ చేశారు. అన్యమత ప్రచారం అంటూ సర్వత్రా ఆందోళన వ్యక్తం కావడంతో అప్రమత్తమైన పోలీసులు, ఆలయ అధికారులు విచారణ చేపట్టారు. చివరకు చికెన్ రైస్ ఎగ్ రైస్ ఆలయ ఆవరణలో పంపిణీ చేయలేదని బయట పంపిణీ చేసిన దాన్ని నిత్యం అక్కడ అడుక్కునే నిరుపేద భక్తులు ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చినట్లు స్పష్టం చేశారు. మరోసారి అలా జరగకుండా కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.ఆలయ అధికారులు, నిఘా వర్గాలు చేతులుకాలక ఆకులు పట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకుండా హుండీలో నగదు మాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసి? ఆలయ ఆవరణలో మాంసాహారం పంపిణీతో శుద్ధిచేసి సంప్రోక్షణ నిర్వహించారు. ఇకనైనా అధికారులు మేల్కొని పకడ్బందీ చర్యలు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిచో ఆందోళన చేపట్టక తప్పదని విశ్వహిందూ పరిషత్, బిజెపి నాయకులు హెచ్చరించారు. మరోవైపు గత నెలలో రైతుల పేరిట రాజన్న కోడెలు పొంది అక్రమంగా విక్రయించిన విషయంపై అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసి అక్రమంగా కోడెలు పొందిన వారి నుంచి 26 కోడెలు స్వాధీనం చేసుకుని రాజన్న గోషాలకు తరలించారు. మరోవైపు ఏడాది కాలంగా రాజన్న కోడెలు 1975 పొందిన వారు రైతులా, రైతుల మసుగులో దళారులా అని తేల్చేందుకు సమగ్ర సర్వే చేపట్టారు. సర్వే కోసం 20 మందిని నియమించి తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాలకు, జిల్లాకు ఇద్దరు చొప్పున నియమించి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు నివేదిక సమర్పించనున్నారు. కలెక్టర్ సైతం రాజన్న గోశాలను సందర్శించి పశువుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆలయ అధికారులను, పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.

## వైభవంగా గణపతి పూజ మహోత్సవం..








**కొల్చారం,డిసెంబర్29( సూర్యరేఖ)**మండల కేంద్రమైన కొల్చారం రేణుకా మాత ఆలయ ఐదవ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం రేణుక మతా ఆలయంలో గణపతి పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన రేణుకా మాత ఆలయంలో అమ్మవారి ప్రతిష్టాపన జరిగి నాలుగు సంవత్సరాల ముగియడంతో 5 వ వార్షికోత్సవం సందర్భంగా గౌడ సంఘ సభ్యులు గ్రామ పురోహితులు శ్రీనివాస శర్మ మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం నిర్వహించి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి ప్రకాష్ పంతులు, గౌడ సంఘ సభ్యులు రామకృష్ణ గౌడ్,అశోక్ గౌడ్,రాజాగౌడ్,కృష్ణ గౌడ్,వెంకట్ గౌడ్,రామకిష్ట గౌడ్, లక్ష్మినారాయణ గౌడ్,సుధాకర్ గౌడ్,రామా గౌడ్,పాపాగౌడ్,నారా గౌడ్ కృష్ణగౌడ్,శేఖర్ గౌడ్,శ్రీధర్ గౌడ్,దుర్గాప్రసాద్ గౌడ్, ఉపేందర్ గౌడ్,రాజేందర్ గౌడ్,యాద గౌడ్,మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఏడుపాయలను దుర్గామాతను దర్శించుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ







**కొల్చారం,డిసెంబర్29(సూర్యరేఖ)** తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వన దుర్గ మాతను ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఏడుపాయలు చేరుకొని మన దుర్గం మాత్రం దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు.అమ్మవారికి ఓడి బియ్యం కుంకుమార్చనలు తలనీలలు సమర్పించారు.భక్తుల అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడినాయి.ఆత్మకి ఇబ్బందులు రాకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిన్ రెడ్డి,కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ట్రయాంగిల్ లవ్ స్టోరీలో ట్విస్టులే..ట్విస్టులు

**నిజామాబాద్ :** కామారెడ్డిలో ఎస్సై, లేడీ కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ ట్రయాంగిల్ సూసైడ్ ఇష్యూలో సంచలన నిజాలు బయటపడ్డాయి. ఎస్ఐ, లేడీ కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ మిస్సింగ్, సూసైడ్ ఘటన కామారెడ్డి జిల్లాలో కలకలం రేపుతోంది. భిక్కనూరు ఎస్సై సాయి కుమార్, బీబీపేట పీఎస్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సహకార సంఘంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నిఖిల్ అనే యువకుడు ఒకేసారి కనిపించకుండా పోయారు. వీరిలో శ్రుతి, నిఖిల్ మృతదేహాలను సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో గుర్తించారు. కామారెడ్డి మిస్టరీ డెత్స్ కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. భిక్కనూరు ఎస్సై సాయికుమార్, లేడీ కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేటకు చెందిన యువకుడు నిఖిల్ రెండ్రోజుల క్రితం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో శవాలై తేలిన సంగతి తెలిసిందే. ఈ ముగ్గురు నీళ్లలో మునగడంతోనే చనిపోయినట్లు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైంది. నీటలో ఊపిరాడక మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ముగ్గురి శరీరాలపై ఎటువంటి గాయాలు లేవని పోస్టుమార్టం నివేదికల్లో వెల్లడైనట్లు తెలిసింది. అయితే, ముగ్గురూ కలిసే చనిపోయారా? లేకుంటే ఒకరు సూసైడ్‌కు ప్రయత్నిస్తే కాపాడేందుకు యత్నించి మిగిలిన ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారా..? అనే విషయంపై పోలీసులు విచారణ ప్రారంభించారు.చెరువు కట్టపై దొరికిన సెల్‌ఫోన్లే ఈ కేసులో కీలకంగా మారాయి. ముగ్గురి సెల్‌ఫోన్లు ఈనెల 25న మధ్యాహ్నం 1.26 గంటలకు స్విచాఫ్ అయినట్లు నిర్ధారించారు. అదే సమయంలో నీటిలో మునిగి చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. వారి కాల్‌డేటా, వాట్సప్ చాటింగ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. శ్రుతి, నిఖిల్‌ల మధ్య సూసైడ్‌పై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. 'నేను సూసైడ్ చేసుకుంటాననంటే... నేను చేసుకుంటానని.. కాదు కాదు ఇద్దరం కలిసే చేసుకుందాం' అంటూ ఇరువురి మధ్య ఆత్మహత్యపై చాటింగ్ ఉన్నట్లు సమాచారం. వీరిద్దరూ ఎస్సై సాయి కుమార్‌తోనూ పలు విషయాలపై చర్చించినట్లు తెలిసింది.ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు, కీలక ఆధారాలు లేకపోవడంతో సాంకేతికత సాయంతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. భిక్కనూరు పీఎస్ నుంచి అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వరకు దారి పొడవున ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు సేకరించారు. ఎస్సై సాయి కుమార్ చెందిన మూడు సెల్‌ఫోన్లలో రెండు అన్‌లాక్ కాలేదని వెల్లడించారు. అన్‌లాక్ అయిన ఫోన్‌లోని వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. 2018 బ్యాచ్ పోలీసుల నుంచి ఎస్సై సాయికుమార్ నడవడికపై కూడా వివరాలు సేకరిస్తున్నారు.

# బిజినెస్

## రిలయన్స్ చేతికి కర్కినోస్ హెల్త్‌కేర్

**న్యూఢిల్లీ:** రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్).. టెక్నాలజీ ఆధారిత హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ కర్కినోస్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను రూ.375 కోట్లకు కొనుగోలు చేసింది. అనుబంధ సంస్థ రిలయన్స్ స్ట్రాటజిక్ బిజినెస్ వెంచర్స్ (ఆర్‌ఎస్‌బీవీఎల్) ద్వారా ఈ కొనుగోలు చేపట్టినట్లు ఆర్‌ఐఎల్ తెలిపింది. 2020 జూలై 24న ఏర్పాటైన కర్కినోస్.. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించటం, డయాగ్నోసిస్, చికిత్స వంటి సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 60కి పైగా హాస్పిటల్స్‌తో ఒప్పందాలను కలిగి ఉంది.




## టాప్-10 సంస్థల్లో ఆరింటి ఎం-క్యాప్ రూ.86,848 కోట్ల వృద్ధి.. రిలయన్స్, హెచ్డీఎఫ్సీ బ్యాంకులకు భారీ లబ్ధి..!

గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లలో టాప్-10 సంస్థల్లో ఆరు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.86,847.88 కోట్లు పెరిగింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా లబ్ధి పొందాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ -30 గతవారం 657.48 పాయింట్లు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 225.9 పాయింట్ల లాభంతో ముగిశాయి.




రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ లాభ పడ్డాయి. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నష్టపోయాయి. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20,235.95 కోట్లు పుంజుకుని రూ.13,74,945.30 కోట్ల వద్ద స్థిర పడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం-క్యాప్ రూ.20,230.9 కోట్ల లాభంతో రూ.16,52,235.07 కోట్ల వద్ద ముగిసింది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.17,933.49 కోట్ల లబ్ధితో రూ.5,99,185.81 కోట్ల వద్ద నిలిచింది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.15,254.01 కోట్ల లాభంతో రూ.9,22,703.05 కోట్ల వద్ద ముగిసింది. భారతీ ఎయిర్ టెల్ ఎం-క్యాప్ రూ.11,948.24 కోట్లు పెరిగి రూ.9,10,735.22 కోట్లకు చేరుకుంది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎం-క్యాప్ రూ.1,245.29 కోట్లు పుంజుకుని రూ.5,49,863.10 కోట్లకు చేరుకుంది. మరోవైపు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11,557.39 కోట్ల నష్టంతో రూ.7,13,567.99 కోట్లకు చేరుకుంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8,412.24 కోట్లు కోల్పోయి రూ.5,61,406.80 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.2,283.75 కోట్ల పతనంతో రూ.7,95,803.15 కోట్ల వద్ద ముగిసింది. టీసీఎస్ ఎం-క్యాప్ రూ.36.18 కోట్ల నష్టంతో రూ.15,08,000.79 కోట్ల వద్ద స్థిర పడింది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), ఐటీసీ, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్ నిలిచాయి.

# బాబోయ్.. మళ్లీ పుంజుకున్న గోల్డ్, సిల్వర్ రేట్లు

ఇంకో రెండు రోజుల్లో ఈ ఏడాది పూర్తి కానుంది. ఇదే సమయంలో బంగారం వెండి ధరలు పెరుగుతూ, తగ్గుతున్నాయి. ఈ క్రమంలో నిన్న తగ్గిన ఈ ధరలు నేడు మళ్లీ పుంజుకున్నాయి. దీంతో ఈరోజు (డిసెంబర్ 29న) ఉదయం 6.20 గంటల నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 240 పెరిగి రూ. 76,740కి చేరింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 70,098కి చేరింది. మరోవైపు హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 76,720కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ. 70,327కు చేరింది. ఇక వెండి ధర విషయానికి వస్తే కిలో వెండి రూ. 1260 తగ్గి రూ. 88,600 స్థాయికి చేరుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (10 గ్రాములకు) (24 క్యారెట్స్, 22 క్యారెట్స్)
ముంబైలో రూ. 76,600, రూ. 70,217
ఢిల్లీలో రూ. 76,740, రూ. 70,098
హైదరాబాద్‌లో రూ. 76,720, రూ. 70,327
విజయవాడలో రూ. 76,720, రూ. 70,327
కోల్‌కతాలో రూ. 76,500, రూ. 70,125
చెన్నైలో రూ. 76,820, రూ. 70,418
బెంగళూరులో రూ. 76,660, రూ. 70,272

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కిలోకు)
చెన్నైలో రూ. 89,010
ఢిల్లీలో రూ. 88,600



ముంబైలో రూ. 88,750
కోల్‌కతాలో రూ. 88,640
హైదరాబాద్‌లో రూ. 88,890
విశాఖపట్నంలో రూ. 88,890
బెంగళూరులో రూ. 88,820

బంగారం స్వచ్ఛత తెలుసుకోవడం ఎలాగో తెలుసా..
బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి %×ూా% (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్క్ ఇస్తారు. 24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999, 23 క్యారెట్‌లపై 958, 22 క్యారెట్‌పై 916, 21 క్యారెట్‌పై 875, 18 క్యారెట్‌పై 750 అని ఉంటుంది. ఎక్కువగా బంగారాన్ని 22 క్యారెట్లలో విక్రయిస్తుండగా, కొందరు 18 క్యారెట్లను కూడా ఉపయోగిస్తారు. క్యారెట్ 24కి మించదు, క్యారెట్ ఎక్కువైతే బంగారం స్వచ్ఛంగా ఉంటుంది. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది.

గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే ముందు మళ్లీ రేట్లు తెలుసుకోవాలని సూచన. వీటిలో GST, TCS వంటి ఇతర ఛార్జీలు కలిగి ఉండవు.

# ప్రైవేట్ బ్యాంకుల్లో అట్రిక్షన్లు ఎక్కువే

అట్రిక్షన్లు అనే పదం ఇప్పటి వరకూ ఐటీ, టెక్నాలజీ కంపెనీల్లోనే ఉండేది. ఒక కంపెనీలో పని చేస్తున్న వృత్తి నిపుణుల్లో పలువురు మెరుగైన వేతన ప్యాకేజీ కోసం ఇతర కంపెనీల్లోకి బదిలీ అవుతున్నారు. ఇప్పుడు ఇదే పరిస్థితి బ్యాంకులను తాకింది. ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగులు 25 శాతం అట్రిక్షన్లు కొనసాగుతున్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల బ్యాంకుల నిర్వహణకు ముప్పు పొంచి ఉందని '2023-24లో భారతీయ బ్యాంకుల్లో ప్రగతి- ధోరణులు' అనే అంశంపై ఆర్బీఐ నివేదిక పేర్కొంది. సెలెక్టెడ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్ఎఫ్‌బీస్)ల్లో ఉద్యోగుల అట్రిక్షన్లు అధికంగా ఉంటాయని తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగుల సంఖ్య ఎక్కువ అని వెల్లడించింది. కానీ, గత మూడేండ్లలో ప్రైవేట్ బ్యాంకుల్లో అట్రిక్షన్ రేటు దాదాపు 25 శాతం ఉందని వివరించింది. ఉద్యోగుల అధిక అట్రిక్షన్ల వల్ల ఆయా బ్యాంకుల నిర్వహణకు ముప్పు ఏర్పడుతుందని ఆర్బీఐ పేర్కొంది. కస్టమర్ సర్వీసుల్లో అంతరాయం, లాస్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషనల్ నాలెడ్జ్, ఉద్యోగుల నియామక ఖర్చుల పెరుగుదల వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించింది. ఉద్యోగుల అట్రిక్షన్లను తగ్గించాలని ఆయా బ్యాంకులతో జరిగిన చర్చల్లో వెల్లడించామని,




తప్పనిసరి వ్యూహాలను కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. బంగారం, జ్యువెల్లరీలపై రుణాలు, టాపప్ రుణాల మంజూరులో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆర్బీఐ పేర్కొంది. బంగారం రుణాల మంజూరీ విధానాన్ని సమగ్రంగా సమీక్షించుకోవాలని, నిర్దిష్ట కాల వ్యవధిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. బంగారం రుణాల మంజూరు విషయంలో ఔట్ సోర్సింగ్ సేవలు, థర్డ్ పార్టీ సర్వీస్ ప్రొవైడర్ల వినియోగంపై తగినంత నియంత్రణ ఉండాలని సూచించింది.

# డబ్ల్యూటీసీ ఫైనల్‌కి చేరిన దక్షిణాఫ్రికా

## మరి భారత్ సంగతేంటి?

# స్పోర్ట్స్

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మూడవ ఎడిషన్ ఫైనల్ రేసు ఉత్కంఠగా సాగింది. ఈ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ టిక్కెట్ కోసం మూడు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. తాజాగా దక్షిణాఫ్రికా జట్టు ఫైనల్ రేసులో దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికా తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను 2 వికెట్ల తేడాతో ఓడించి %ఔజ% ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. థెంబా బావుమా నేతృత్వంలోని జట్టు పాకిస్థాన్‌పై ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో కేవలం 2 వికెట్ల తేడాతో విజయం సాధించి తొలిసారి టైటిల్ మ్యాచ్‌కు టిక్కెట్‌ను బుక్ చేసుకుంది. సెంచూరియన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు, కగిసో రబడ, మార్కో జాన్సన్ 9వ వికెట్‌కు అజేయంగా 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో దక్షిణాఫ్రికా ఓడిపోయే మ్యాచ్‌లో విజయం సాధించింది. గెలిచిన మ్యాచ్‌లో ఓడిపోయిన పాకిస్థాన్ సిరీస్‌ను కోల్పోయింది. రెండు జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరుగుతోంది. ఈ సిరీస్‌లో ఒకే ఒక్క మ్యాచ్ గెలిచినా, ఆఫ్రికా జట్టు %ఔజ% ఫైనల్స్‌కు చేరుతుంది. అందుకు తగ్గట్టుగానే తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు చేరుకోవడంలో సఫలమైంది. రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్‌ను 237 పరుగులకు ఆలౌట్ చేసిన దక్షిణాఫ్రికాకు 148 పరుగుల విజయ లక్ష్యం ఉంది. లక్ష్యం చిన్నదే కావడంతో దక్షిణాఫ్రికా సులభంగా గెలుస్తుందని అందరూ భావించారు.కానీ పాకిస్థాన్ పేసర్లు అబ్బాస్, ఖుర్రం షాజాద్ 19 పరుగులకే 3 వికెట్లు పడగొట్టి ఆఫ్రికాకు ఆరంభంలోనే షాక్ ఇచ్చారు. అయితే ఇక్కడి నుంచి జట్టు ఇన్నింగ్స్‌ను చేజిక్కించుకున్న ఐడెన్ మార్క్రామ్, కెప్టెన్ తెంబా బావుమా నెమ్మదిగా జట్టును విజయతీరాలకు చేర్చారు. నాలుగో రోజు ఈ జోడీ 27 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. కానీ ఈసారి అటాక్ చేసిన మహ్మద్ అబ్బాస్ మార్క్రమ్ వికెట్ తీశాడు. దీని తర్వాత కూడా కెప్టెన్‌గా ఆడిన తెంబా బావుమా జట్టును 96 పరుగులకు చేర్చాడు. దక్షిణాఫ్రికా విజయానికి 52 పరుగులు చేయాల్సి ఉంది. జట్టు వద్ద ఇంకా 6 వికెట్లు ఉన్నాయి. అయితే ఇక్కడ కెప్టెన్ బావుమా చేసిన తప్పిదంతో జట్టు ఇన్నింగ్స్ తడబడింది. అబ్బాస్ బంతిపై అనవసరంగా భారీ షాట్‌కు వెళ్లి బావుమా వికెట్‌ను కోల్పోయాడు. దురదృష్టవశాత్తు ఆ దశలో బావుమా నాటౌట్‌గా లేరు. కానీ అంపైర్ ఇచ్చిన నిర్ణయాన్ని సమీక్షించకుండా బావుమా పెద్ద తప్పు చేశాడు. ఎందుకంటే





రివ్యూలో బంతి అతని బ్యాట్‌కు బదులుగా బావుమా తొడ ప్యాడ్‌కు తగిలిందని స్పష్టమైంది. ఇక్కడి నుంచి అబ్బాస్ ధాటికి దక్షిణాఫ్రికా తర్వాతి 11 బంతుల్లో 3 వికెట్లు కోల్పోయింది. వరుస బంతుల్లో డేవిడ్ బెడింగ్‌హామ్, కార్బిన్ బోష్‌లను అవుట్ చేయడం ద్వారా అబ్బాస్ మొదటిసారిగా ఒక టెస్టులో 6 వికెట్లు తీశాడు.
దీంతో దక్షిణాఫ్రికా కేవలం 99 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. అయితే ఇక్కడి నుంచి మార్కో జాన్సన్-కగిసో రబడ చిరస్మరణీయ భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని అందించారు. వీరిద్దరూ అబ్బాస్ సహా పాక్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొని జట్టును విజయానికి చేరువ చేశారు. విజయం చేరువయ్యాక రబడ గేర్ మార్చి బౌండరీల వర్షం కురిపించాడు. అమెర్ జమాల్ ఒకే ఓవర్లో 11 పరుగులు చేశాడు. ఆపై యానాస్ అబ్బాస్ బంతిని బౌండరీ కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు. రబడ 26 బంతుల్లో 31 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, జాన్సన్ 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇది ఇలా ఉంటే టీమిండియా 55.88 విజయ శాతంతో 3వ స్థానంలో ఉండగా ఆసీస్ 58.89 విజయ శాతంతో రెండో ప్లేస్‌లో ఉంది. టీమిండియా %దీ+ు% ట్రోఫీని గెలిస్తేనే ఫైనల్‌కి వెళు ్ంది.

## బుమ్రా మాయాజాలం.. ఆసీస్ ఆరో వికెట్ డౌన్




మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్టుపై భారత్ పట్టుబిగిస్తున్నది. లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ అద్భుత పోరాటంతో టీమ్‌ఇండియా పోటీలోకి వచ్చింది. నాలుగోరోజు ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే భారత్ ఆలౌట్ అయింది. 9 పరుగులు మాత్రమే జోడించిన సెంచరీ హీరో నితీశ్ రెడ్డి (114) లియోన్ బౌలింగ్‌లో స్టార్క్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో ఆస్ట్రేలియాకు 120 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్సింగ్స్ ప్రారంభించిన ఆసీస్ బ్యాటర్లకు టీమ్‌ఇండియా పేసర్లు చుక్కలు చూపించారు. ఏ దశలోను కుదురుకోనియకుండా క్రమంతప్రకుండా వికెట్లు పడగొడుతున్నారు. దీంతో ఆతిథ్య జట్టు 85 రన్స్‌కే 5 వికెట్లు కోల్పోయింది. బుమ్రా వేసిన 6 ఓవర్‌లో ఆసీస్ ఓపెనర్ కొన్‌స్టాస్ (8) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో ప్రారంభమైన వికెట్ల పతనాన్ని సిరాజ్ కొనసాగించాడు. 43 పరుగుల వద్ద ఉస్మాన్ ఖవాజా వికెట్ పడగొట్టాడు. ఇద్దరు సీమర్లు పోటాపోటీగా వికెట్లు పడగొట్టడంతో 93 రన్స్‌కే 6 వికెట్లు కోల్పోయింది. బుమ్రా 4 వికెట్లు తీయగా, సిరాజ్ ఇద్దరిని ఔట్ చేశాడు. ఆస్ట్రేలియా ప్రస్తుతం 192 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.



# అలా పిలవకండి.. పవన్ అభిమానులకు 'ఓజీ' టీమ్ రిక్వెస్ట్


ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రీసెంట్‌గా తన అభిమానుల మీద అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లోని కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుని శనివారం పవన్ కళ్యాణ్ పరామర్శించిన విషయం తెలిసిందే. అనంతరం మీడియాతో మాట్లాడుతుండగా.. అతని అభిమానులు ఓజీ.. ఓజీ.. ఓజీ.. సీఎం.. సీఎం అని పిలవడం మొదలుపెట్టారు. దీంతో అసహనానికి గురైన పవన్ కళ్యాన్.. అభిమానులను ఉద్దేశించి.. మీకు ఎక్కడ ఏం స్లోగన్ ఇవ్వాలో కూడా తెలియకపోతే ఎలా అయ్యా.. పక్కకి వెళ్లండి అంటూ అసహ్యించుకున్నాడు. దీంతో ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ విషయంపై తాజాగా ఓజీ టీం స్పందిస్తూ.. అభిమానులు ఓజీ అని పవన్‌ని పిలవద్దంటూ రిక్వెస్ట్ చేసింది. ఓజీ సినిమాపై మీరు చూపిస్తున్న అభిమానం, ప్రేమ మా అదృష్టంగా భావిస్తున్నాము. ఓజీ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి నిరంతరం పని చేస్తున్నాం. కానీ మీరు పవన్ కళ్యాణ్ గారు పొలిటికల్ సభలకు వెళ్లినప్పుడు, సమయం, సందర్భం చూడకుండా ఓజీ.. ఓజీ అని అరవడం, వారిని ఇబ్బంది పెట్టడం సరైంది కాదు. వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎంత కష్టపడుతున్నారో మనందరికీ తెలుసు. ఆ స్థానాన్ని, స్థాయిని గౌరవించడం మన కనీస బాధ్యత. అందుకని ఇంకొన్ని రోజులు ఓపికగా ఉందాం. 2025 ఓజీ పండుగ వైభవంగా నిలుస్తుందని మేము గట్టిగా నమ్ముతున్నాం అంటూ డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ రాసుకోచ్చింది.




# రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చిన దిల్ రాజు

మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం వచ్చేసింది. 'గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్‌కు నిర్మాత దిల్ రాజు గుడ్ న్యూస్ చెప్పాడు. ఈ మూవీ ట్రైలర్‌ను న్యూ ఇయర్ కానుకగా.. జనవరి 01న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా బృందావన కాలనీలోని వజ్రా మైదానంలో 256 అడుగుల రామ్‌చరణ్ భారీ కటౌట్ ఏర్పాటు చేశారు అభిమానులు. అయితే ఈ కటౌట్ లాంఛ్ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చాడు దిల్ రాజు. ఈ సందర్భంగానే మూవీ ట్రైలర్ జనవరి 01న రాబోతుంది వెయిట్ చేయండి అంటూ చెప్పుకోచ్చాడు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా.. సునీల్, ఎస్ జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. సూపర్ రెస్పాన్స్‌తో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రైలర్ కోసం వెయిట్ చేస్తున్నారు అభిమానులు.

# అనిల్‌రావిపూడి- చిరంజీవి సినిమా జోనర్ ఇదే..



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవికి సంబంధించిన ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ స్టార్ యాక్టర్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. తాజాగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేయబోతున్న సినిమాపై ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. ఈ ఇద్దరు ఎలాంటి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారంటూ ఇండస్ట్రీ సర్కిల్‌లో జోరుగా చర్చ నడుస్తుంది. కాగా నిర్మాత సాహు గారపాటి ఆ సస్పెన్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. సినిమాలో ఎలాంటి సందేశం ఉండదు. యాక్షన్ ఎలిమెంట్స్‌తో సాగే అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ ఇది. మేమంతా చిరంజీవి సినిమాలు, ఆయన ట్రేడ్ మార్క్ ఎలిమెంట్స్ చూస్తూ ఎదిగినవాళ్లం. అనిల్ రావిపూడి స్టైల్‌లో మెగాస్టార్‌ను చూడబోతున్నామన్నాడు. అనిల్ రావిపూడి ఫ్లేవర్ కామెడీతో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా ఉండబోతుందని స్పష్టం చేశారు. ఇప్పుడీ కామెంట్స్‌తో చిరంజీవి నుంచి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ సినిమా రాబోతుందని అర్థమవుతోంది. చిరంజీవి ప్రస్తుతం విశ్వంభర, శ్రీకాంత్ ఓదెల సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఇవి పూర్తి కాగానే అనిల్ రావిపూడి సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లబోతున్నాడట. కాగా అనిల్ రావిపూడి ప్రస్తుతం వెంకటేశ్ హీరోగా సంక్రాంతికి వస్తున్నాం చేస్తున్నాడు. ఈ మూవీ సంక్రాంతి కానుకగా 2025 జనవరి 14న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.




# కిరణ్ అబ్బవరం 'దిల్ రుబా' టీజర్‌కి ముహూర్తం ఫిక్స్

'క' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న యువ నటుడు కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే క సినిమాకి సీక్వెల్ తీసే పనిలో ఉన్న కిరణ్ మరో సినిమాను విడుదలకు సిద్ధం చేశాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా' ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ మూవీ టీజర్‌ను న్యూ ఇయర్ కానుకగా.. జనవరి 03న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. మరోవైపు ఈ సినిమాను ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,